

# ఇదా నువ్విచ్చే తీర్పు?

ఆంధ్ర ప్రభ - 20-4-1977 - 27-4-1977

---

ఒకరి కన్నీరు మనకు... శాపం కాకూడదంటే ఎవరి జీవితాలకూ మనం... నిషిద్ధాలు విధించకూడదు. కాలం మారేకొందీ... ఆనాటి అధర్మాలే... ఈనాటి సహజ ధర్మాలవుతాయి.

- జయప్రద

---

"రక్షించండి, రక్షించండి. దుర్మార్గుడా! వదులు."

అమావాస్య అంధకారంనుండి చీల్చుకు వస్తున్న హృదయ విదారకమైన ఓ స్త్రీ ఆర్తనాదం.

"రక్షించండి, బాబూ!" నోటికెవరో చెయ్యి అడ్డుపెట్టగా పెగిలించుకొని అరుస్తున్న గొంతు. రెండు జతల కాళ్ళ పెనుగులాట తాలూకు భయంకరమైన పద విన్యాసం.

మరో దిక్కునుండి నాలుగు పాదాల పరుగు తాలూకు ధ్వని. ఆ పాదాల తాలూకు చేతుల్లోని టార్చిలైటు వెలుగు, పెనుగులాడి నీరసించి నిస్త్రాణ అయి భయం భయంగా చూస్తున్న ఓ స్త్రీ ముఖంమీద పడింది. అదే వెలుగు పారిపోతున్న వ్యక్తి వీపుమీద పడి విరిగిపోయింది.

* * * * *

"మీరా? మీరా. రాజేశ్వరి!" అతని కంఠంనిండా ఆపుకోలేని ఆశ్చర్యం. ఆమె మాట్లాడలేదు. వెర్రిగా చూస్తూ వుంది. క్షణాలు గడిచేకొద్దీ ఆ కళ్ళల్లోని భయం స్థానంలో మెల్లిమెల్లిగా కాంతి నిండసాగింది.

"ఈమె నీకు తెలుసా, రోహిణీ!" మురళి అడుగుతున్నాడు.

నిశ్శబ్దంగా ఆమె చేతులు జోడించింది. మరి నిల్చోలేనట్లు అక్కడే కుప్పగా కూలిపోయింది.

"రాజేశ్వరి!"

ఆమె చెంపలమీదుగా కన్నీళ్ళు కారిపోతున్నాయి. ఆమె పెదవులు చెప్పాలనుకున్నదేదో చెప్పలేక ఒణుకుతున్నట్లున్నాయి.

"ఎందుకు? ఎందుకు కన్నీళ్ళు, రాజేశ్వరీ! ఇలాంటి సమయంలో నువ్వు నైటికి ఎందుకు వచ్చావు? మీ అత్తయ్య ఆరోగ్యం ఎలాగుంది?" ఆత్రంగా అడుగుతున్న అతని వంక విచారంగా చూసింది రాజేశ్వరి.

"ఒంటరిగా ఇలాంటి వీధుల్లోకి నువ్వు రావలసింది కాదు."

"మాట్లాడు. రాజేశ్వరీ, ఒంటరిగా ఎందుకొచ్చావు ఇలా?" ఆమె హఠాత్తుగా కన్పించిన ఆశ్చర్యంలో ఆమె ఎలాంటి పరిస్థితిలో ఉందో కూడా గమనించుకోకుండా ఆ స్థితికి కారణాలు వెతుకుతున్నాడతను.

ఆమె మెల్లగా పెదాలు కదిపింది. దాహం అన్నట్లు సంజ్ఞ చేసింది. అప్పటికతను తేరుకున్నాడు. మురళి వైపు చూశాడు.

"ఇక్కడ నీళ్ళు దొరకవు. నా రూమ్ దగ్గిరే. రండి వెళ్దాం."

ఆమె సందేహంగా చూసింది.

"రాజేశ్వరీ! నేనెలాంటి వాడినో నీకు తెలుసు. నాతో రావడానికి నీకభ్యంతరం ఉండదనుకుంటున్నాను. రా, రాజేశ్వరీ!" అతను చేయందించాడు. ఆమె నిశ్చింతగా చేయి అందుకొని నిశ్శబ్దంగా అతనివెంట నడిచింది.

"కూర్చో రాజేశ్వరీ!"

ఆమె ఓ మూలగా గోడనానుకొని ఒదిగి కూర్చుంది.

"ఇది మా మురళీ రూమ్. వాడిని చూడ్డానికి నేనీ ఊరు వచ్చాను. మేమిద్దరం కలిసి ఈ రోజు ఆ చెత్త సినిమాకు వెళ్ళకుండా వుండివుంటే నువ్వు నాకు కనబడుండేదానివి కావు. నిన్ను మేము దక్కించుకునేవాళ్ళమూ కాము."

రోహిణీ గ్లాసునిండా మంచినీళ్ళు ఆమె కందించి, ఆమె పూర్తిగా త్రాగేవరకు ఆగి గ్లాసు అందుకొని ప్రక్కన పెడుతూ అన్నాడు.

"ఇప్పుడు చెప్పు. రాజేశ్వరీ! ఒంటరిగా ఎందుకు బయలుదేరావు?" మురళి కుర్చీ దూరంగా లాక్కుని కూర్చున్నాడు.

"ఒంటరిదాన్ని... ఒంటరిగా కాక ఇంకెలా వస్తాను, బాబూ. బ్రతకడానికేదో పని చేసుకోవాలిగా?" ఆమె నోరు విప్పింది.

అతను చకితుడైనాడు.

"మీ అత్త ఏమయ్యారు?"

"ఆమె చనిపోయి చాలా ఏండ్లు గడిచిపోయాయి."

"నీకు ఏ ఆధారం చూపకుండా ఆమె చనిపోయిందా?" అతని కంఠంలో ఆమె అత్త ఎడల తిరస్కారం. ఆమె మాట్లాడలేదు. ఆమె ఒకే ఒక ఆత్మబంధువు అత్త తాలూకూ స్మృతులలోకి జారిపోయింది.

* * * * *

నేను పొరపాటు చేశాను, తల్లీ! నీకంటూ ఏమీ మిగల్చకుండా నేను మాత్రం తప్పుకుంటున్నాను.

ఆంధ్రదేశపు పొలిమేరల్లోని ఒక పట్టణం మారు మూల పెంకుటింటి నాలుగు గోడల మధ్యన, మృత్యుద్వారానికి అభిముఖంగా వడి వడిగా అడుగులేస్తున్న ఓ వృద్ధురాలి హీనస్వరాన్నుండి వచ్చిన ఆర్తనాదమది.

"లేదులే, అత్తా! నువ్వు విపరీతంగా ఆలోచించి మనసు పాడుచేసుకోవద్దు. నీకు నయమవుతుంది."

తనకు తెలుసు, ఆమె బ్రతకదని, కానీ... అబద్ధాలు చెప్పి ఊరడించి ఇంకా కొన్ని ఘడియలు ఆమె ఒడిలో తలదాల్చుకోవాలనే దురాశ తన్ను వదలడం లేదు. అత్త మాట్లాడలేదు. తన కళ్ళలోకి చూస్తున్న ఆమె చూపులు భావ విహీనమైపోయి శూన్యంగా మారిపోయాయి.

బహుశః ఆమెకు తన కోడలి ముందు పరుచుకొన్న సుదీర్ఘమైన ఎడారిలాంటి ఒంటరి బతుకులో క్షణ క్షణం తనని తాను రక్షించుకుంటూ గడపబోయే దయ్యాల్లాంటి రోజులు, వార్ధక్యంలో తోడులేక, చేసుకుతినే ఓపికలేక, రోగాలకు చికిత్సలేక, ఆకలితో కుళ్ళిపోయే మసక చిత్రం కళ్ళముందు కనిపిస్తూందేమో?

అలా తనని తలుచుకొని శూన్యమైపోయిన అమెను చూస్తుంటే తన హృదయం నిండా కృతజ్ఞత చోటు చేసుకుంది.

“అత్తా! జబ్బుతో మంచాన పడున్న నీకు నాలుగు డబ్బులు సంపాదించి, మందులిప్పించలేని అశక్తురాలిని. ఆడదాన్ని, కనీసం నన్ను ఒడిలోకి తీసుకొని అదరించినందుకు కృతజ్ఞతగా నిన్ను ప్రశాంతంగానైనా వెళ్ళిపోనీ, అత్తా, నా గురించి మరిచిపోవాలి నువ్వు?”

విరక్తిగా నవ్వింది అత్త. “నిజమేనే. నీకింత తిండి పెట్టి నీ శరీరాన్ని మాత్రం పెంచాను. నీ కోరికలను మటుకు నీకంటె ముందే సమాధి చేశాను.”

చెమ్మగిల్లిన కళ్ళతో తల అడ్డంగా ఊపింది తను. “లేదత్తా. విధిచేత, మనుష్యుల చేత కూడా మోసగించబడి దిక్కుతోచని నన్ను నీ పైట చాటున దాచి నా కన్నీళ్ళు తుడిచావు. నీకే లేని నువ్వు... నీ తిండిలో ఇంత పెడుతున్నావు. మోడుబారిపోయిన నా జీవితానికి మళ్ళీ ఒక సంసారాన్ని ఏర్పరచాలని ప్రయత్నించావు. ఇంకేం చేయాలత్తా. కాకపోతే అందరు కాదంటూంటే వాళ్ల నెదిరించలేకపోయావు. కాదన్న వాళ్ళు నా స్వంత బంధువులత్తా. నా రక్త సంబంధీకులు. వాళ్ళు, వాళ్ళున్నారులే, అత్తా నాకు” అని చెప్పాలని తన ఉద్దేశం కానీ, కన్నీళ్ళతో పూడిపోయిన తన గొంతు పెగిలి రాలేదు. కళ్ళు నిండిన కన్నీటిని దాచుకునే ప్రయత్నంలో అక్కడ నుండి లేచి వచ్చేసింది.

* * * * *

“రాజేశ్వరీ!”

అమె గతం చెదరిపోయింది.

అమె మెల్లిగా లేచి నిలబడింది.

“ఇక వెళతాను. బాబూ!” అమె చేతులు జోడించింది.

“కూర్చో, రాజేశ్వరీ! ఆ రోజు నువ్వు నన్ను తిరస్కరించిన కారణం ఈ నాటికి ఊహించలేకపోతున్నాను. నీ కభ్యంతరం లేకపోతే చెప్పు, రాజేశ్వరీ, ఎందుకిలా జరిగింది?”

ఆమె తన కథను చెప్పడానికి సిగ్గు పడలేదు. సంకోచించలేదు. మళ్ళీ కూర్చుంటూ మెల్లిగా ప్రారంభించింది.

సరిగ్గా పదేళ్ళ క్రితం భర్త చనిపోయి శూన్యంగా కూర్చుని ఉన్న నా దగ్గరికి మామగారు వచ్చి నా తలమీద చెయ్యివేసి, 'నీ భర్త పోతే మటుకేమి? నేనున్నాను నీకు. ఏడవకు, రాజేశ్వరీ!' అన్నప్పుడు ఆలంబన దొరికినట్టు ఆనందంగా తల ఎత్తిన నాకు ఆయన కళ్ళలో నాకు కావలసిన ఆప్యాయత దొరకలేదు. ఆ కళ్ళు ఆశగా చూస్తున్నాయి.

"మనిద్దరం వేరింటి కాపురం పెడదాము. పట్నం వెళదామా?" ఎదిగిన నలుగురు మరుదులు మధ్య అత్తగారు లేని ఇంట్లో భయం భయంగా తిరుగుతున్న తల్లి, తండ్రి లేని నాకు ఎదురైన ఆదరణ అది. ముడుచుకుపోయి మౌనంగా కూర్చున్న నన్ను అప్పటికి దయతలచి వెళ్ళిపోయిన అతని రాక్షస హస్తాలనుండి ఆ రాత్రే తప్పించుకొని పిన్ని ఇంటికి వచ్చాను. స్వయాన తల్లి రక్తం పంచుకుని పుట్టిన పిన్ని నన్ను తప్పకుండా ఆదరిస్తుందని వచ్చిన నాకు వాకిట్లోనే బలంగా నిరాశ ఎదురయింది.

"పరిస్థితులను మంచిగా ఎదుర్కోవాలి కాని, పారిపోయి వస్తారా? భర్తపోయినా, అత్తగారింట ఉంటేనే ఆడదానికి పరువు?" అని హితబోధ చేసి మామగారితో రాయబారాలు నడపసాగింది పిన్ని. వెళ్ళిన నాలుగు రోజుల్లేనే కేవలం పనిమనిషిగా వుండటానికి కూడా భారమైపోయాను మా బీద పిన్నికి. తన బీదరికాన్ని పరువు ప్రతిష్టల ముసుగులో దాచుకుంటూ మామగారికొరకు ఎదురు చూస్తున్న పిన్ని భావాన్ని గ్రహించిన నేను ఒకరోజు ఆమెకు చెప్పి మేనత్త దగ్గిరికి బయలుదేరాను.

ఆమెకు కావలసినంత ఆస్తి ఉంది. కనక నాకు తిండి పెట్టడానికి అభ్యంతరం లేకపోయింది. మాటిమాటికి మారిపోతున్న పని మనుషులతో ఆమెకు తలనొప్పిగానే ఉంది.

"ఇక్కడే ఉండిపోదువుగానీ, నీకింత తిండిపెట్టలేకపోతానా?" అని ఆమె అన్నప్పుడు నాకు సేదతీరినట్లయింది. కానీ స్వర్గీయులైన నా తండ్రికి స్వయాన చెల్లెలు. తన బిడ్డలాంటి బిడ్డను. తల్లి లేదు. తండ్రి లేడు! భర్తా లేడు. ఒంటరి మేనకోడల్ని... ఆమె దగ్గరనుండి ఆప్యాయత ఆశించి నిరాశపడి అల్లాడుతున్న రోజుల్లో అత్తకొడుకు అత్యాచారాన్ని ప్రతిఘటించే ఉద్దేశంతో అర్ధరాత్రి గట్టిగా కేకపెట్టాను. అత్తలేచి పరిగెత్తుకు వచ్చింది.

ఆమెను చుట్టుకుపోయి వెక్కి వెక్కి ఏడ్చాను. అంతదూరంలో మదపుటేనుగులా నిలబడ్డ కొడుకుని చూడగానే ఆమెకు పరిస్థితి అర్థమైనట్టుంది. అతను తలవంచుకుని

వెళ్ళిపోగానే నన్ను అంతదూరాన నిలబెట్టి తీవ్రంగా నా కళ్ళలోకి చూస్తూ అరిచింది.

"ఏదో గతిలేని దానివని చేరదీస్తే నా పరువు తీసేట్టున్నావే! అర్ధరాత్రి అంతలావు కేకవేస్తే ఇరుగూ పొరుగూ ఏమనుకోవాలి? ఆడదానివైనప్పుడు నీ శీలాన్ని నువ్వే రక్షించుకోవాలి. అంతేగాని, మగాడన్నవాడు ఆడది ఇంట్లో వుంటే ఊరుకుంటాడా?"

నా సర్వేంద్రియాలు ముద్దకట్టుకుపోయాయి. ఏడవడం కూడా మరిచిపోయి నిలబడిపోయాను.

ఇలాటి మాటలు ఏ స్త్రీ నోటివెంటైనా వస్తాయనేది నా ఊహకందని విషయం... అందులో నా తండ్రి చెల్లెలి నోటి వెంట. అమానుషత్వానికి తలపెట్టిన కొడుకు, అమానుషత్వాన్ని సమర్థించిన తల్లి. ఇద్దరూ పెడుతున్న గురక శబ్దం వింటూ ఆ అర్ధరాత్రి ఇంట్లో నుండి బైటికి వెళ్ళగలిగే సాహసం లేక ముడుచుకుని కూర్చొని రాత్రంతా గడిపిన నేను.... తెల్లవారకముందే అత్తకైనా చెప్పకుండా వెనక ఎవరో తరుముకు వస్తున్నట్టు స్టేషన్‌కి వచ్చి కనిపించిన రైలెక్కేశాను.

ఇంకొన్ని క్షణాల్లో పరిసమాప్తం కాబోతున్న నా పాపిష్టి జీవితం తలచుకుంటూ రైలు కదిలే శబ్దం కొరకు ఎదురుచూస్తున్నాను.

* * * * *

"అయితే, మీ అత్త అలాంటిదా? అయితే, నేను పొరబడ్డానన్నమాట. బాధ్యత ఆమె మీద పెట్టి నీ కన్యాయం చేశానన్నమాట... నువ్వైనా ధైర్యంచేసి ఉండాల్సింది, రాజేశ్వరీ!" అని ఇంకా ఏదో చెప్పబోతున్న అతనిని మధ్యలోనే ఆపుతూ గబగబ తల అడ్డంగా తిప్పింది రాజేశ్వరి.

"ఆమె... ఈమె కాదు. ఈ అత్త ఈ అత్త..." ఆమె గొంతు ఆగిపోయింది. కానీ, అత్తను తలుచుకున్న ఆమె కళ్ళు ఆరాధనాభావంతో ఒక్క క్షణం వెలిగాయి.

* * * * *

"రామ్మా, రాజీ" శారీరకంగానూ, మానసికంగానూ కూడా అలిసిపోయి ఆ ఇంట్లో అడుగుపెట్టిన నేను ఆ ఆప్యాయతతో కూడిన ఆహ్వానానికి ఆశ్చర్యపోయాను. పిన్ని దగ్గరనుండి, మేనత్త దగ్గరినుండి నేను పొందిన అవమానాలు నేనింకా మరిచిపోలేదు. ఎదుటి మనిషిని నమ్మే అపురూపమైన దశ నుండి ఎప్పుడో జారి అపనమ్మకపు మైకంలో పడి వున్నాను. అందుకే చావడానికి ధైర్యం చాలక శరీరాన్నిక్కడకు లాక్కువచ్చిన నేను ఆమె ఆతిథ్యాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించలేకపోయాను.

"రా, రాజీ"

నేను కదల్లేదు. నా కథంతా ముందే చెప్పేసి ఆమె దగ్గరనుండి ఇంత రక్షణ కొరకు వచ్చానని దేవిరించి, అందుకు ఆమె అంగీకరిస్తే అడుగు ముందుకు వేయాలని నిర్ణయించుకున్న నేను ఆఖరి తీర్పుకొరకు ఎదురుచూస్తున్న ముద్దాయిలా నిల్చున్నాను. అత్త దయగా నవ్వుతూ అంది.

"ఎండనబడి వచ్చావు. స్నానం చేశాక మాట్లాడుకుందాం. రా లోపలకి."

ఆమె ఆహ్వానంలో ఎటువంటి ఆర్ద్రత నన్ను ఆకర్షించిందో తెలియదు. కాని, ఆమె ఆదరణకు నా మనస్సు మరొక్కమారు లొంగిపోయింది. మెల్లిగా లోపలికి నడిచాను. స్నానం చేస్తున్నా, భోజనం చేస్తున్నా, ఈ వైభోగం ఎంతోసేపులే అనే శంక, నా బాధన్ను బయటపెట్టుకుంటే కాని తీరని బరువు నన్ను నిలవనీయడ్డంలేదు.

"కాసేపు పడుకో, నేను తలుపులు ముందుకు లాక్కుని వెళ్తాను" అని వెళ్ళబోతున్న అత్త చెయ్యి పట్టుకున్నాను. పట్టుకున్నాక గబుక్కున వదిలేశాను.

'ఈమె నాకేమవుతుంది? ఈమె దగ్గర నాకేపాటి చనువు ఉంది? కేవలం ఈమె అమ్మకు మారుటి తమ్ముడి భార్య.' నా సంకోచం గ్రహించి తనే నా ప్రక్కన కూర్చొని నా చేతిని తన ఒడిలోకి తీసుకుని-

"చూడు, రాజీ! నువ్వు చెప్పాలనుకుంటున్నదేదో నేను ఊహించుకోగలను. కనీసం చేతిలో సంచైనా లేకుండా, తోడు లేకుండా నా ఇంటికి వచ్చిన నువ్వు నాలుగు రోజుల నా ఆతిథ్యానికి రాలేదని నాకు తెలుసు. నీకు పెళ్ళిచేసి ఆనందంలో నీ తల్లీ, తండ్రీ కూడా ఒకరివెంట ఒకరు స్వర్గానికి వెళ్ళి అదృష్టవంతులయ్యారు. పుట్టిల్లు లేకుండా మిగిలిపోయిన నీ దురదృష్టం నాకు తెలియంది కాదు" అని ఆగి నా కళ్ళల్లో అసంతృప్తి చూచి మెల్లిగా నా ప్రక్కగా జరుగుతూ అంది.

"నీ చిరిగిపోయిన కొద్దిపాటి జీవితంలోని సంఘటనలు వినేంత తియ్యటివి కావు. వినాలనీ నాకు లేదు. నాకు పొద్దుపుచ్చుకోవడానికి అది మార్గం కూడా కాదు. కాకపోతే నీ మనస్సులో భారం తీరుతుందంటే చెప్పు వింటాను."

నేనుం మాట్లాడలేకపోయాను. నా కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఆమె చల్లటి హస్తాలలో ఒక్క సంవత్సరం పెరిగాను. నిశ్చింతగా బ్రతికాను. ఆ తర్వాత మీరు తారసపడ్డారు. ఆ దిగులుతోనే అత్త మరో సంవత్సరం తరవాత నన్ను ఒంటరిదాన్ని చేసి స్వర్గస్థురాలయింది. ఆ తరువాత కథ మీరు ఊహించుకో గలరు, బాబూ!" ఆమె పేలవంగా నవ్వింది రాజేశ్వరి. సానుభూతిగా చూస్తున్నాడు రోహిణి.

"ఆ తరువాత కథ నిన్ను ఇలాటి పరిస్థితిలో చూడగానే నేనర్థం చేసుకున్నాను. కానీ రాజేశ్వరీ, ఆ రోజు నువ్వు ఒప్పుకున్నావు. మీ అత్త ఒప్పుకుంది. మరలా ఏమయింది? నువ్వెందుకు పెళ్ళికి అంగీకరించలేదు? నాకు తెలుసుకోవాలని ఉంది రాజేశ్వరి!!"

"చెప్తాను బాబూ! ఆ కథ గురించి ఆరేళ్ళ తరువాత ఈనాడు మీకు చెప్పడానికి నాకు సిగ్గేమిటి? ఆనాటి ముగ్ధత్వం, భావమాధుర్యం, బిడియం ఈనాడు ఇంకా నాకు మిగలనిచ్చారా? గొణిగినట్టు అంటున్న ఆమె వైపు ఆత్రుతగా జాలిగా చూచాడు రోహిణి.

* * * * *

"మీరు మరోలా భావించకండి. మీతో కొద్దిగా మాట్లాడాలి." గుడికి వెళుతున్న నా కాళ్ళు చప్పున ఆగిపోయాయి. నా కళ్ళు బహుళా పెద్దవయ్యుంటాయి. నా నోట్లో నుండి మాట మాత్రం రాలేదు.

"అలా గుడి మెట్లమీద కూర్చుందాం వస్తారా?" అన్నారు మీరు.

స్నేహితురాలు కమల ఇంట్లో మిమ్మల్ని చూసిన గుర్తయితే ఉంది గాని, మీరు నాతో మాట్లాడబోయేదేమిటో బొత్తిగా అర్థం కాలేదు.

అప్రయత్నంగా మీ వెంట నా కాళ్ళు మాత్రం కదిలాయి.

"కూర్చోండి."

నేను కూర్చోలేదు. నేనిక కూర్చోననుకున్నారేమో... మీరే నాకు కొద్ది దూరంలో నిలబడి అన్నారు.

"మీ కిష్టమైతే, అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని వివాహం చేసుకోవాలనుకుంటున్నాను."

నాకు బహుశః ఆ క్షణంలో మీరు చెప్పిందేదో బొత్తిగా అర్థమయ్యుండదు. నా వెర్రి ముఖం చూచి మరలా మీరే అన్నారు.

"మీ కిష్టమో, లేదో సూటిగా చెప్పండి. నేను బాధపడను."

అప్పటికి కాస్త చైతన్యం వచ్చిన నేను విపరీతంగా భయపడిపోయాను.

"నాకు తెలియదు. మా అత్త నడగండి."

మరునాటి ఉదయాన్నే నా ఇంటి గడపలో మిమ్మల్ని చూచిన నేను విస్తుపోయాను. మీ పెదాలు కొద్దిగా విచ్చుకుంటున్నట్టనిపించి రివ్వున ఇంట్లోకి పరుగెత్తాను.

"నీ కొరకెవరో వచ్చారత్తా" అనేసి వంటింట్లోకి పారిపోయాను. నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. అదే క్షణాన అత్త నా జీవితానకివ్వబోయే తీర్పు కొరకు వెయ్యి కళ్ళు చేసుకుని ఎదురు చూస్తున్నాను. భయంగా, బెరుగ్గా, దిగులుగా, ఆనందంగా, ఉత్సాహంగా, నీరసంగా... కలగాపులగంగా వంటింటి కిటికీ వారగా నిల్చున్న నాకు... మీరు వచ్చి నడవలో కూర్చోవడం, మీ ఎదురుగా అత్త చాప మీద కూర్చోవడం అంతా కనిపిస్తూనే ఉంది.

మీ మాటల్లో మృదుత్వానికి పరవశించిపోతున్న నా హృదయాన్ని నా హైందవ రక్తం 'తప్పు' అని వారింపజూసింది. కానీ, నా సంఘ భీతి వెనక నాకూ ఒక ముచ్చటైన సంసారం, ముత్యాల్లాంటి బిడ్డలు కావాలనే ప్రలోభం నన్ను క్రమ క్రమంగా ఆక్రమించు కోసాగింది. కాని నా ఊహాపథాన్ని, ఆనందాన్ని ఒకే ఒక్క నిజం, భయం కళ్ళెం వేసి లాగింది.

'ఒకవేళ అత్త ఒప్పుకోదేమో.'

నా నరనరాన్ని నీరసం ఆక్రమించుకుంది.

'ఛీ ఆశపడకూడదు. నేను శాపగ్రస్తురాలిని. ఆ అదృష్టం నా జీవితానికి లేదు. గనుకనే ఆయన్ని భగవంతుడు తీసుకువెళ్ళిపోయాడు' బలమైన నిరాశ నన్ను నిర్వీర్యురాలిని చేసింది. బెదిరిపోతున్న మనసును కూడదీసుకుంటూ, ఏదో పనిచేస్తున్నట్టు కత్తిపీట ముందుకు లాక్కుని కూర్చున్నానేగాని, నా చెవులు అత్త నా జీవితానికివ్వబోయే తీర్మానం కొరకు ఎదురుచూస్తూ ఉన్నాయి.

"కమల ఊరెళ్ళిందా?" మీరసలు ఎందుకొచ్చారో అర్థం కాని అత్త... మౌనంగా కూర్చోవడం మర్యాద కాదని, ఏదో మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నట్లుంది. మీ ఇంటికి, మా ఇంటికి అట్టే రాకపోకలు లేవు.

"అక్క ఊరెళ్ళింది. ఇక్కడకు నేనొచ్చింది మీ రాజేశ్వరిగారి విషయం మాట్లాడ డానికి." అత్త అవస్థ అర్థమయిన మీరు నేరుగా రంగంలోకి దిగారు. బహుశ అత్త ఇంకా ఆశ్చర్యంలో నుండి తేరుకోనుండుండదు.

"రాజేశ్వరిగారి కిష్టమైతే, మీరు ఒప్పుకుంటే నేను ఆమెను పెళ్ళి చేసు కుంటాను."

మీరు మాట పూర్తి చేయకముందే దడదడలాడే గుండెలతో గబుక్కున అసంకల్పితంగా లేచి నిలబడ్డాను. వంటింటికి నడవకూ మధ్యగల చిన్న కిటికి గుండా మా అత్త కళ్ళు మెరవడం స్పష్టంగా కన్పించింది.

నా గుండెల్లో మరలా మధురమైన ఊహలు. ఈ తడవ నేను వాటికి నిర్దాక్షిణ్యంగా పిరికి మందు పోయదలచుకోలేదు.

అత్త కొద్దిసేపు మాట్లాడలేకపోయింది. వెంటనే తేరుకుంటూ అంది. ఆమె ముఖం అంత ఆనందంగా కళకళలాడుతూ ఉండడాన్ని నేనెప్పుడూ చూడలేదు.

"ఎంత మంచి వాడివి నాయనా నువ్వు! దేవుడిలా వచ్చావు దాన్ని రక్షించడానికి" ఆమె పెదాలు వణుకుతున్నాయి.

ఎందుకో ఆమె కళ్ళు చెమ్మగిల్లినట్టనిపించింది.

"క్షమించండి. ఆమెను రక్షించబోతున్నానని నేననుకోవడం లేదు. ఆమె అంటే నా కిష్టం. అంతే."

"అదేమిటి, నాయనా! ఈ కాలంలో ఆడపిల్లలకు రెండో పెళ్ళి కావడమంటే సామాన్యమా? నువ్వు ఆ పిల్లను ఉద్ధరించడం కాకపోతే దీన్నేమంటారు?"

"దీన్ని ఉద్ధరించడమే అనుకుంటే, అమ్మా! చాలా మంది ఆడపిల్లలు భార్యా విహీనులైన మా మగజాతిని చాలా మందినే ఉద్ధరిస్తున్నారు. అలా అనకండి."

వింతగా చూచింది అత్త.

"మగాడు పెళ్ళి చేసుకోవడమనేది సామాన్యమైన విషయం...." చెప్పబోతున్న అత్తను ఆపుతూ కాస్త దూకుడుగా అన్నారు... "మీరు క్షమిస్తే మాబోటి వాళ్ళను పొగిడేయడంతో మేము కూడా గొప్ప ఘనకార్యం చేస్తున్నామనే మైకంలో పడిపోయి దాంపత్య జీవితంలో రసజ్ఞతను పోగొట్టుకుంటున్నాము" అని ఆగారు. "మన్నించండి. ఆవేశంగా మాట్లాడినట్లున్నాను. మీరు పెద్దవాళ్ళు. నేను నోరు జారాను."

అత్త ఈసారి మా వంక చాలా ఆప్యాయంగా చూసింది.

"నువ్వు చల్లగా నూరేళ్ళు జీవించాలి. నీ కడుపున నీ లాంటి బిడ్డలు పదిమంది కలగాలి" అన్నట్టు ఆమె కళ్ళు మిమ్మల్ని దీవిస్తున్నాయి.

ఇంతటి ఆనందం నుండి తేరుకుని లౌకిక విషయాల్లో పడడానికి ఆమెకు కొంత వ్యవధి కావలసి వచ్చింది.

"రాజీ! కాఫీ తీసుకురా" అని కేకపెట్టి "నేను వచ్చి అమ్మా వాళ్ళతో మాట్లాడుతాను, నాయనా" అంది.

"మీ కిష్టమైతే ప్రస్తుతం వాళ్లకు తెలియవలసిన అవసరం లేదు." కాస్తంతగా తలవంచుకుని చెబుతున్న మీ భావం పూర్తిగా బోధపడినట్టు లేదు.

"అంటే"

"సూటిగా చెప్పాలంటే వాళ్ళకిష్టం లేదండి. వాళ్ళకి అమ్మాయితో బాటు కొన్ని ఆచారాలు, కొంత డబ్బు కూడా కావాలి."

అత్త చాలా సేపటిదాకా మాట్లాడలేదు.

"నా ఆశకు హద్దు లేకపోయింది. నాకా ఆలోచనే రాలేదు" గొణుక్కుంటున్నట్టుగా అంది.

"మీకు నా మీద నమ్మకముండాలేకాని, కాలం అందరినీ కలిపేస్తుంది." అర్థింపుగా చూస్తున్న మీ వైపు మెప్పుకోలుగా చూసింది అత్త.

"మంచిది, నాయనా!"

తరవాత మీరేం మాట్లాడుకున్నారో తెలియదు. మీకు కాఫీ ఇవ్వకుండానే సన్నజాజి పందిరి కిందికి పరుగెట్టాను నేను.

* * * * *

నేను కలలు కన్న భవిష్యత్తు నిజరూపం దాల్చబోతున్నందుకు ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నన్ను కొన్నాళ్ళపాటు ఆ భ్రమలోనైనా బ్రతకనీయకుండా నా బంధు జనం బిలబిలమంటూ దిగారు. మా అత్త ఈ శుభవార్త వీళ్ళకు అందజేయక ముందే ఎవరి దగ్గరినుండో వర్తమానం అందినట్లుంది.

వస్తూనే మేనత్త అత్తమీద యుద్ధం ప్రకటించింది. "అదేమిటే, శాంతమ్మా? పసివాళ్ళు, వాళ్ళకి బుర్ర లేకపోతే నీ జ్ఞానమేమయిందట? నీకైతే పిల్లా పీచు లేరు. నీకా బెంగెందుకుంటుంది? విధవ పిల్లకు వివాహం చేస్తే రేప్పొద్దున ఆచారం మంట కలసి, మా ఇళ్ళలో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అవుతాయా?"

పిన్ని స్వార్థం అంత తేలిగ్గా బయటపడే రకం కాదు.

"అది నీకు బరువైతే చెప్పు. నేను తీసుకువెళ్ళిపోతాను. నా అక్క కూతురేం నాకు బరువు కాదు. దాని పీడ యీవిధంగా మాత్రం నువ్వు వదిలించుకోదలుచుకుంటే మేమంతా చూస్తూ ఊరుకోలేం."

అత్తకు మాట్లాడే అవకాశం కూడా వాళ్ళివ్వలేదు. వాళ్ళ జీవితాలు చీకటి మయం చెయ్యొద్దని బ్రతిమలాడారు. ఇలాటి అనాచారపు పనులుచేసి పితృదేవతలకు అసంతృప్తి కలిగించవద్దని ఉపదేశించారు. వాళ్ళని కాదని ఆమె ఏమైనా చెయ్యదలుచుకుంటే ఇక నా ముఖం వాళ్ళెవరూ చూడమని ప్రతిజ్ఞ చేశారు. అసలు ఈ పెళ్ళి ఎలా జరుగుతుందో మేమూ చూస్తామని బెదిరించారు.

అలా అత్త పిన్నితో.. మా అత్తతో యుద్ధం చేస్తున్న సమయంలో అత్తకూతురు వాణి, పిన్ని కూతురు ప్రసూన నాకు వాళ్ళ వాళ్ళ కష్టాలు చెప్పుకోసాగారు. "నా సిన్సియర్ అడ్వైజ్ చెప్పనా, రాజీ! మొగుడు, ఈ పిల్లలు అంతా భ్రాంతి. నిజానికి నాకీ విషయం ముందుగా తెలిసుంటే పెళ్ళిచేసుకోకపోదును. నువ్వు మరలా అదే ఊబిలోకి దిగబోతోంటే నాకు చాలా విచారంగా ఉంది." అని అన్న కూతురే మరో గంటకు పడతావని గదమాయిస్తున్న తల్లికి జవాబుగా, పడతా ఊహు అని తల అడ్డంగా ఊపుతూ 'పడను' అని అర్థం వచ్చేలా చెబుతున్న రెండేళ్ళ కొడుకు భాషా ప్రావీణ్యానికి ముగ్ధురాలై, 'ఓరినీ!' అని గుండెలకు హత్తుకుని మాతృత్వపు ఆనందాన్ని అనుభవిస్తుంటే చూచి నేను చూసింది నిజమా, విన్నది నిజమా అనే మీమాంసలో పడిపోయాను.

"వదినా! మీ ఆయన వచ్చారు. పూలమాలతో ఎదురు పో" అన్న ఆడబిడ్డ హాస్యానికి సిగ్గు మొగ్గయిపోతున్న పిన్నిని చిత్రంగా, అసూయగా చూస్తూ అనుకున్నాను.

'ఇన్ని సంవత్సరాలు సంసారం చేసిన ఆమెకు తొలి యవ్వనం తాలూకు పారవశ్యం ఇంకా వదలలేదే! నన్నెందుకా తీయటి అనుభూతులనుండి వంచిస్తున్నారు వీళ్ళు?'

* * * * *

"రాజీ" పిలిచి పిలిచి అలిసి పోయినట్టున్న ఆ స్వరానికి ఉలిక్కిపడ్డాను.

వన్ను ఏదో పని ఉన్నట్టు పిలిచిన అత్త నేను దగ్గరికి వెళ్ళగానే నా చేతిని ఆత్రుతగా, ఆప్యాయంగా తన గుండెల కానించుకుంటూ "నువ్వెలా బ్రతుకుతావే, రాజీ" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఒకనాడు నా బంధువుల మాటవిని, వాళ్ళ పరువు ప్రతిష్టల కుండకు చిల్లి పడకుండా కాపాడావు వాళ్ళని. వాళ్ళకామాత్రం కృతజ్ఞత ఉండదంటావా, అత్తా. నా కింత తిండి పెట్టరంటావా?" అన్నాను మెల్లిగా సంశయంగా.

ఆమె నా మాటలు సాంతంగా విన్నట్టు లేదు. మరలా పాత జ్ఞాపకాలలోకి జారిపోయినట్టుంది. కొన్ని నిమిషాల మౌనం తరువాత "అతనెక్కడున్నాడో? ముత్యం లాంటి పిల్లాడు" అని నిట్టూర్చింది. అంతటి దుఃఖంలోనూ నాకు నవ్వొచ్చింది. 'అత్త పిచ్చిగాని, రెండు సంవత్సరాల తర్వాత అతనెక్కడుంటాడు? భార్యా పిల్లలతో ఎక్కడో కళకళలాడుతూ ఉండే ఉంటాడు.'

"అతను నీ కొరకు ఎదురుచూస్తూ ఉండి ఉంటే..." ఆమె ఊహలు ఆమెకే ఎబ్బెట్టుగా తోచాయేమో ఆగిపోయిందామె. అత్త నా ముందున్న జీవితంలో ఎదురుపడే మధుర క్షణాలకొరకు భ్రమిస్తుంటే, నేను జరిగిపోయిన దానిని తవ్వుకుని పశ్చాత్తాప పడుతున్నాను.

అనాడు నా బంధువులంతా నాకు హితబోధచేసి, అత్తకు అల్టిమేటమ్ జారీచేసి వెళ్ళాక అత్త నీరసంగా కూలబడిపోతూ అంది.

"నన్నేం చేయమంటావో నువ్వే చెప్పు రాజీ! నువ్వు నా కన్న బిడ్డవే అయ్యుంటే నేనీలోకాన్ని లెక్కచేసి ఉండేదాన్ని కాదు. కానీ, అమ్మా! నిన్ను కనని దోషానికి నేను నీకు మంచి చేసినా చెడే చేసిందని లోకం దూషిస్తుంది. నా నిర్ణయంవల్ల నీ జీవితానికేదయినా బెడిసికొడితే నీ బంధువుల అండ కూడా నీకు అందకుండా పోతుంది. నేనేమీ ఆలోచించలేకపోతున్నాను. నీ ఇష్టం. రాజీ! నువ్వేం చేయాలనుకుంటే అది చెయ్యి. నీ భవిష్యత్తును శాసించే అధికారం కానీ అడ్డుపెట్టే హక్కు కానీ నాకు లేదని ఈనాడు తెలిసిందమ్మా."

నాకు పెళ్ళి చేస్తే నా బంధువుల తరతరాల భవిష్యత్తు చెక్కముక్కలయి పోతుందనే విషయం తనకు స్ఫురించనందుకు నా జీవితంమీద తనొక్కతే అధికారిణి అయినట్లు మీకు మాట ఇచ్చేసినందుకు అత్త తనను తానే మనసులో నిందించుకుంది. మీకు సంజాయిషీ ఇవ్వవలసిన క్షణాల కెదురుపడటానికి గుండె నిబ్బరాన్ని చేసుకుంది.

"మీరు... మీరు వింటున్నారా?"

"చెప్పు వింటున్నాను. చెప్పు రాజేశ్వరీ!"

"శ్రేయోభిలాషుల సలహాల భ్రాంతిలో అత్తకు ద్రోహం చేస్తున్నానేమో అనే శంకతో, స్వార్థంకంటే త్యాగం గొప్పదనే మైకంలో, నా అనుభవంలో మగాళ్ళు నాకందించిన అపనమ్మకంలో మిమ్మల్ని పూర్తిగా నమ్మలేక, బంధువుల అండ పోతుందేమోననే భయంతో తల అడ్డంగా ఊపాను. అనాడు అదెంత పాపిష్టి క్షణమో... తీరా అయిదారేళ్ళన్నా గడవకముందే, ఒంటరిదాన్ని చేసి తినడానికింత తిండయినా సంపాదించుకోలేని అశక్తురాలిని చేసి రక్షణలేని ఈ సంఘం తాలూకు కబంధహస్తాల లోకి నిర్దాక్షిణ్యంగా నెట్టి పకపకనవ్వుతోంది.

నా గతం తాలూకు పశ్చాత్తాపం నాకందిస్తున్న కన్నీళ్ళను తుడవడానికి ఎత్తిన అత్త చెయ్యి బలహీనంగా ఒరిగిపోయింది.

"ఏడవకు, తల్లీ! నేను పోకముందే నీకేదో మార్గం చూపిస్తాను. ఇంతమంది బంధువులకు నువ్వొక్క దానివీ భారమవుతావా? నేను పెట్టిన తిండి నీ కింకెవరూ పెట్టకపోతారా?" అన్న ఆమె ఇకలేదు.

'నువ్వు పెట్టిన తిండి కబళంగానైనా ఎవ్వరో వెయ్యకపోరు. అత్తా! కానీ, నువ్వు నాకిచ్చిన అభయం మరేహస్తాలు నా కివ్వలేవని నాకు బాగా తెలుసు అత్తా.'

అలా అనుకున్న నేను భ్రమలోనే ఉన్నానని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు. నా టెలిగ్రామ్‌తో అత్తను పరామర్శించడానికి వచ్చిన బంధు జనమంతా మెలకువగానే తప్పుకున్నారు.

"ఎదిగిన కొడుకుని ఇంట్లో పెట్టుకుని, ఈ పిల్లనెలా తీసుకెళ్ళను? నువ్వే చెప్పు?" అన్నది మేనత్త.

"కోడలు అంత మంచిదికాదు. శాంతా! లేకపోతే రాజీ నాకు బరువవుతుందా?" అని తన బీదరికాన్ని బయటపెట్టుకోవటం ఇష్టంలేక, దోషాన్నంతా కోడలిమీదకు నెట్టిన పిన్ని నాకు గుణపాఠం నేర్పిస్తే, వాళ్ళ మాటలు అత్త ఆయుస్సును హరించేసాయి.

"నేనానాడే ఇంకాస్త ధైర్యం చేసివుంటే కనీసం ఆఖరి క్షణాల్లో అయినా శాంతిగా వెళ్ళిపోయుండేదాన్ని" అని గొణుక్కుంటున్న అత్త వాళ్ళ కర్థంకాలేదు.

చెప్పడం ఆపి ఆయాస పడుతున్న రాజేశ్వరి వంక విచారంగా చూస్తున్నాడు రోహిణి.

"పడుకుంటావా, రాజేశ్వరీ?"

తల అడ్డంగా ఊపింది రాజేశ్వరి.

"వద్దు కూర్చోగలను" అని ఆగి,

"కానీ, బాబూ! నా కర్థం కానిదల్లా ఒక్కటే. కాలానికి ఎదురీద వద్దని హితవు చెప్పిన వీళ్ళు. ఈనాడు నన్ను కాలానికి ఎదురుగా ఒంటరిగా ఎందుకు వదిలేసినట్టు?"

"ఒక కనీసపు ఆడదానికింత క్షేమకరమైన చోటు చూపించలేని ఈ సంఘం ఆడదాని బ్రతుక్కి ఇన్ని అడ్డంకులెందుకు విధించాలి? నా సంసారం, నా బిడ్డలు, నా జీవితం... నేను ఏర్పరచుకోవాలనుకున్న నన్ను ఎందుకు శాసించినట్టు? నన్ను రక్షించలేని వీళ్లకెవరిచ్చారు నన్ను శాసించే అధికారం. వీళ్ళు వీళ్ళు..." చప్పున గుండెలు పట్టుకుని అక్కడే ఒరిగిపోయింది. అణచుకోలేని ఆమె భావావేశం, ఆమెను అశక్తురాలిని చేసింది.

"ఏమయింది రాజేశ్వరీ! నీ కసలేమయింది?"

ఆత్రంగా ముందుకు వచ్చి ఆమె ముంజేతి మీద వేళ్ళుంచి పల్స్ చూస్తున్న రోహిణిని చూచి విచారంగా నవ్వింది రాజేశ్వరి.

"గుండె జబ్బేమయినా ఉందా? డాక్టర్ని పిలవమంటావా?"

తల అడ్డంగా ఊపింది.

"నాకే జబ్బూ లేదు. ఉండేదల్లా ఆకలి జబ్బు మాత్రమే. మీరు కనపడ్డారనే ఆనందంలో ఇన్ని మాట్లాడాను. నాలుగురోజులుగా సరియైన తిండిలేని నాకు, ఇంత సేపు మాట్లాడే ఓపిక ఉండదని నేను తెలుసుకోలేకపోయానంతే."

శ్రోతలిద్దరూ ఉలిక్కిపడ్డారు. మురళి నిశ్శబ్దంగా లేచి వెళ్ళిపోయాడు.

రాజేశ్వరి చెయ్యి పట్టుకుని లేపి మంచంమీద పడుకోబెట్టాడు రోహిణి. ఈసారి ఆమె అభ్యంతరం చెప్పలేదు. క్షణం తర్వాత కళ్ళు తెరిచిందామె. అతని ముందు ఎంతోసేపు మౌనంగా ఉండలేకపోయింది. కొన్ని సంవత్సరాల క్రితం కేవలం నాలుగు మాటలు మాట్లాడిన ఆ యువకుడు తప్ప తనకి ఈ ప్రపంచంలో మరెవ్వరూ లేరన్నంత అపేక్షగా చూస్తోంది.

"చూశారా, బాబూ! బీదతనమెంత లోకువయిందో? రోజుకొక్కసారయినా తినందే బ్రతకలేను గనక నాలుగు ప్రైవేట్లు చెప్పి నెలకు ఏభై రూపాయలు సంపాదించుకుంటున్నారు. నా విద్యార్థి అమ్మకు ఈరోజు సినిమా కెళ్ళటానికి నా తోడు కావలసి వచ్చిందిగాని, సినిమా అయ్యాక కనీసం ఆ రాత్రికి తన ఇంట్లో తలదాచుకోమని చెప్పాలనే సంస్కారమే లేకపోయింది. ఈ చీకటి రాత్రిలో నన్ను ఒంటరిగా ఇంటికి పొమ్మని తలుపేసుకుంది."

ఆమె కళ్ళల్లో, జరిగిన అమానుషత్వాన్ని తలుచుకున్న ఆ భయం ఇంకా ప్రతిఫలిస్తూనే ఉంది. మురళి టిఫిన్ తెచ్చాడు. వారించకుండా అందుకని తినేసింది రాజేశ్వరి.

"చూశారా, నా కెంత ఆకలిగా ఉందో! ఇన్ని కష్టాలను ఎదుర్కొంటూ నేనింకా బ్రతుకుతున్నానంటే మీకాశ్చర్యంగా లేదూ."

ఆమె వాగ్ధోరణిని ఆపాలనే ఉద్దేశంతో "కాసేపు పడుకో, రాజేశ్వరీ! మనం తర్వాత మాట్లాడుకుందాం" అంటున్న రోహిణిని వారించిందామె.

"లేదు బాబూ, నన్ను చెప్పనివ్వండి. ఈ అవకాశం నాకు మరలా దొరుకుతుందో, లేదో. ఈ మూసుకున్న కళ్ళు తెరుచుకుంటాయో, లేదో! మిమ్మల్ని క్షమాపణ వేడకుండానే వెళ్ళిపోతే నా ఆత్మకు శాంతి ఉంటుందంటారా?"

ఈసారి రోహిణి మాట్లాడలేదు. ఆమెను ఆపలేమని అతనికి తెలిసిపోయింది.

"ఈ దురదృష్ట జీవితాన్ని బలవంతంగా ఎందుకీడ్చుకొస్తున్నానో తెలుసా? మీ కొరకు... మీ కొరకు, బాబూ! దేవుడుకూడా నేననుకున్నంత నిర్దయుడు కాదని ఈ రోజు తెలిసింది." ఆమె కళ్ళనీళ్ళలో సంతోషం అలలా కదిలింది.

"కానీ, రాజేశ్వరీ, నేను... నేను...."

ఆమె అతడ్ని మధ్యలోనే ఆపేసింది.

"నాకు తెలుసు బాబూ మీరు నా కొరకు కాచుకుని ఎదురుచూడడానికి జరిగిపోయిన ఈ ఆరేడేళ్ళ కాలం అంత స్వల్పమయింది కాదని నాకు బాగా తెలుసు. మీరు నాకొరకింకా ఎదురుచూస్తుంటారనే వెర్రితనం కానీ, మీ జీవితంలో ప్రవేశించాలనే దురాశకానీ నాలో లేవు. కేవలం మిమ్మల్ని తిరస్కరించినందుకు నాకు భగవంతుడు అందించిన నికృష్టమైన బ్రతుకును మీ ముందు పరిచి, మిమ్మల్ని క్షమాపణ వేడుకోవాలనే."

అతను నిమూఢుడిలా వింటున్నాడు. ఆమె ఆగకుండా మాట్లాడుతూనే ఉంది.

"బాబూ! మీలా జీవితాన్ని పంచి ఇవ్వడానికి ఎవరూ ఇష్టపడకపోయినా ఈ శరీరాన్ని పంచివ్వమని చాలా మంది అడిగారు, బాబూ! ఆనాడు మీ విలువ నాకంతగా తెలియలేదు. మీలాంటివాళ్ళు చాలామందే ఉంటారనుకున్నాను" అని విరక్తిగా నవ్వింది.

"అందుకే... అందుకే అరుదైన మిమ్మల్ని మరొక్కసారి చూడాలనే ప్రలోభంతో ఇంతవరకు బ్రతికానేమో..."

"రాజేశ్వరీ!"

"నేనానాడు ఇంకాస్త ప్రయత్నించి ఉంటే నీ జీవితం నందనవనం కాకపోయినా, ఇలా మాత్రం ఉండేదికాదు. నేనానాడు నువ్వు తిరస్కరించినందుకు అభిమానపడ్డానే కాని, నువ్వే పరిస్థితుల్లో నన్ను తిరస్కరించావో ఊహించడానికి కొన్ని క్షణాలు కూడా ఖర్చుచేయలేకపోయాను. నన్ను క్షమించు రాజేశ్వరీ!"

ఆమె అతనికి జవాబు చెప్పలేదు. అతనిని వారించలేదు. అతని కళ్ళల్లోకి ఆరాధనగా, గుళ్ళో దేవుడిని చూస్తున్నట్టు చూస్తోంది.

* * * * *

"మీరేమనుకోకపోతే నాకో సందేహం మిగిలిపోయింది" నిశ్శబ్దాన్ని చీలుస్తూ మురళినుండి వినవచ్చిన మాటలకు ఇద్దరు ఉలిక్కిపడ్డారు.

"చెప్పండి"

"మీరు మా రోహిణిమీద ఆశలేదంటున్నారు. బ్రతుకుమీద తీపి లేదంటున్నారు. అయినా మీ ప్రాణాల్ని, మీ శీలాన్ని భద్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు."

ఆమె అతని మాటల మధ్యలోనే నిరసనగా నవ్వింది. "ఆ ప్రశ్నకు మీకు జవాబు తెలిసి అడుగుతున్నారు."

"మీ నోటినుండి వినాలనుకుంటున్నాను."

"మంచిది. ఈనాడు నాకేదీ దాచిపెట్టాలని లేదు. నాకు అంతర్గతంగా బ్రతుకు మీద తీపిలేకపోలేదు. లేకపోతే దీనిని అంతం చేసుకోవడానికి ఎంతోసేపు పట్టదు. ఏమో, నా జీవితమూ మరలా చిగురించకూడదా అనే ఆశ. ఆ వూహ నాకు ప్రాణం పోస్తోందేమో!"

"తరువాత మరో జీవితంలేదనే సత్యం నా ప్రాణాల్ని తీసుకోడానికి అడ్డు పెడుతోందేమో."

"ఇక నా శీలం సంగతంటారా? దాన్ని పోగొట్టుకున్నందువల్ల నేను పొందేది కేవలం తిండితప్ప మరేముంటుంది? ఆత్మ సంతృప్తిని పోగొట్టుకొని కేవలం తిండి తిని బ్రతికేయాలని నాకు లేదు. నా ముందు మరో పచ్చటి జీవితం..." అని సందేహంగా మధ్యలో చెప్పడం ఆపేసి తిరిగి అంది రాజేశ్వరి.

"నా మాటలు మీకు అసహ్యంగా అనిపిస్తున్నాయి కదూ?"

"లేదు, లేదు. జవాబుకొరకు ఎదురుచూస్తున్నాను నేను."

"కానీ బాబూ! నా ఊహ ఏనాటికీ యథార్థంకాదని నా అనుభవం చెబుతూనే ఉంది. నా ముందు పరుచుకున్న సుదీర్ఘమైన బ్రతుకంతా శూన్యమైందనీ, మరో ప్రపంచం అందులోకి రాదనీ అనుకున్నప్పుడల్లా ఎంత గుండెకోతగా ఉంటుందనీ..."

"మరో పదేళ్ళకు మరో అందమైన జీవితం నాకు సంప్రాప్తిస్తుందనుకుంటే ఎన్ని సంవత్సరాలైనా ఇలా నిరీక్షించవచ్చు. కాని, బాబూ, ఈ జీవితానికింక ఇంతే అనుకున్నప్పుడు కలిగే బాధ మీకర్థమవుతుందా..."

మురళి జవాబు చెప్పలేదు. కూర్చున్న చోటునుండి లేచి ఆమె ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"నేను ఇప్పుడు మిమ్మల్ని వివాహం చేసుకుంటానంటే మీ కభ్యంతరం లేదా!"

"అభ్యంతరం లేదు కానీ, దానితో బాటు మీ మాట మీద నమ్మకం కూడా లేదు, బాబూ! మీది ఆవేశం."

ఆమె నిర్మొహమాటానికి మురళికి ముచ్చటవేస్తే, మురళి నిర్ణయానికి రోహిణి విస్తుపోయాడు.

"నువ్వు... నువ్వేనా, మురళీ ఈ మాటలంటున్నది? నువ్వు మనఃస్ఫూర్తిగా అన్నదే అయితే నాకు సంతోషంగా ఉందిరా."

రాజేశ్వరి నిర్లిప్తంగా చూస్తోంది. రోహిణికంతా విచిత్రంగా ఉంది. అతని మనస్సులో ఆరేళ్ళనాటి ఒకరోజు పత్రికలో చదివిన కథ గురించి చర్చించుకున్న దృశ్యం సినిమాలా స్పష్టంగా కనిపిస్తూంది.

* * * * *

"ఛీ ఛీ ఎన్నిమార్లు చెప్పాలి నీకు? ఈ పిల్లను నా గదిలోకి పంపద్దని. ఇక నీ మాట వినేదిలేదు. ఈ పిల్లను వాళ్ళ నాయనమ్మ ఇంటికి పంపెయ్. ఆ పిల్లే కావాలో, నేనూ బుజ్జాయే కావాలో తేల్చుకో" ఓ పసిబిడ్డ చెంప ఛెళ్ళుమన్న శబ్దమూ, దానివెంట బలవంతంగా ఆపుకొంటున్న ఏడుపు ధ్వనీ లీలగా వినిపించి పరుగెత్తుకొచ్చిన విశాలకి ఎదురయిన ఆహ్వానమది.

చేతులనిండా ఇంకుతో, వాచిపోయిన చిరుచెంపతో బిక్కుబిక్కుమని మూలగా ఒదిగింది ఆరేళ్ళ పసిపాప. ఎంతో ఖరీదయిన గౌనులో అతి బీదగా చూస్తోంది. ఇంకిపోయిన కన్నీటిపొరల వెనగ్గా హృదయవిదారకంగా చూస్తోంది.

ఒక్క పరుగున ఆ పిల్లను చేరి ఆత్రుతగా ఎత్తుకుని గుండె కదుముకుంది విశాలి.

"ఏడవకు తల్లీ! నా బంగారు కొండవుకదూ! నేనున్నానుగా నీకు. నా బంగారు చిత్రవుకదూ" చిత్ర ఒళ్ళంతా ముద్దులతో నింపేసింది. ఆమె కళ్ళు జలపాతాలై పోయాయి. అటు తండ్రి అనాదరణగాని ఇటు తల్లి అతి ఆదరణగాని అర్థంగాని ఆ పిల్ల చిత్రంగా చూస్తోంది. అలా కూతుర్ని పొదివిపట్టుకున్న విశాలికి హఠాత్తుగా అనిపించింది. 'ఈ పిల్ల పుట్టుక ఎంత చిత్రమైంది! ఈ పిల్ల పుట్టుక ఏమి ఘనకార్యం సాధించవలసి ఉందో? దాని పుట్టుకకొరకు దేవుడు రెండు ప్రాణుల్ని వివాహబంధం పేరిట ఓ నెలపాటు బంధించి, అంతలోనే దానిని పుటుక్కున తెంపేసి తమాషా చూశాడు' గాఢంగా నిట్టూర్చిందామె.

* * * * *

తను ఆ ఇంట మెట్టి నెలైనా తిరక్కుండానే భర్తను పరలోకానికి పంపించిందని అపవాదు తనకు కాని, తండ్రి గండాన కడుపున పడిందనే నింద చిత్రకు గానీ లేకుండా తనను కడుపులో పెట్టుకుని కాపాడుతున్న అత్తయ్యపట్ల కృతజ్ఞతతో విశాలి తల మునకలవుతున్న రోజుల్లో ఒకనాడు ఆమె అంది :

"నిన్ను చేసుకోవడానికి మూర్తి ఆసక్తి చూపిస్తున్నాడు. నువ్వేమంటావు విశాలీ."

నివ్వెరపోయిన కోడల్ని చెమ్మగిల్లిన కళ్ళతో చూస్తూ అంది : "పసిపిల్లవు. భగవంతుడెంత అన్యాయం చేశాడు నీకు?"

ఆమె వ్యథ తన దురదృష్ట జీవితం గురించి కావచ్చు లేదా తన ప్రియపుత్రుని శాశ్వత నిష్క్రమణ తాలూకు స్మృతివల్లా కావచ్చు. ఏది ఏమైనా, ఆమె తన వ్యథను తనలోనే దాచుకుని కోడలికి మరో అందమైన జీవితాన్నివ్వాలని చూస్తోంది. నిట్టూర్చింది విశాలి.

ఆమె కళ్ళు అప్రయత్నంగా నిండుకున్నాయి.

"నిన్నెలా వదిలి పోగలనత్తయ్యా! నాకీ జీవితం చాలు."

ఆమె తల అడ్డంగా ఊపింది.

"నేనుండగానే నిన్ను..." అని తన కళ్ళల్లో ఏమి కదలాడిందో ఆమె ఆగింది.

"నిన్ను వదిలించుకోవాలని మేము చూస్తున్నామని నువ్వనుకోవుకదా."

విశాలి గబగబా తల అడ్డంగా ఊపింది.

"అలా జరగకుండా ఉండుంటే అసలీ అదృష్టం నాది కావలిసింది" అని గొణిగి వెంటనే తనను తాను సంబాళించుకుంటూ చెప్పింది.

"ఇందులో తప్పేమీ లేదు. తల్లీ! మన జీవితాల్ని మనం కాకపోతే ఎవరో వచ్చి మలచరు" ఏదో కొత్తదనం కావాలని ఒక్కక్షణం అనిపించినా, ఒళ్ళోవున్న సంవత్సరం పాప వెన్నుతట్టి మేల్కొలిపింది.

'ఛీ! ఛీ. ఇదేమిటి తల్లినైయుండీ, కేవలం నా సుఖాన్ని మాత్రమే కోరుకునేంత స్వార్థపరురాలనై పోయానా నేను!'

ఆ రోజు ఆమె ఆలోచనలకు ఆమెను వదిలేసిన ఆమె అత్త రెండు రోజులయ్యాక మరల అడిగింది.

"ఏమనుకున్నావు విశాలీ?"

"ఏమిటత్తయ్యా" అన్న విశాల అంత అమాయకంగా లేదు. ఈ రెండు రోజులుగా ఆమె ఆలోచిస్తున్నదొక్కటే తోడు కావాలనే కోరిక ఒక పక్క, పాప భవిష్యత్తు ఎలా ఉంటుందో అని శంక ఒక పక్క ఆ సందిగ్ధంలో ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు.

"అదేనమ్మా, మూర్తి మరలా ఫోన్ చేశాడు."

"చిత్ర...."

"నేను అతనితో ప్రస్తావించిన మొదటి విషయం అదే విశాలి! ఆ బిడ్డను ప్రేమించలేకపోయినందుకు నువ్వు తప్పుపట్టకు. బాధ్యతగా చూస్తానని అతను మాట ఇచ్చాడు."

విశాలి మాట్లాడలేదు.

"చూడు విశాలీ! నాకు పాపను వదలాలని లేదు. పోనీ పాపను నా దగ్గరే ఉండిపోనీరాదూ?"

అప్రయత్నంగా విశాలి చేతివేళ్ళు పాప నడుంమీద బిగుసుకున్నాయి.

"ఏదో ప్రలోభం వదలక అడిగాను. బాధపడకు విశాలి! తల్లిని, బిడ్డను వేరు చేసేంత మూర్ఖురాలిని కాను. పాప నీ దగ్గరే ఉంటుంది. కాకపోతే దాని ఖర్చులు గురించి నువ్వు విచారపడకు. అది తప్ప ఈ ఆస్తిని అనుభవించేవారు ఇంకెవరున్నారు?"

అలా అంటున్నప్పుడు ఆమె శూన్యవేదనకు విశాలి హృదయం ఆర్ద్రమయింది. ఆమె నీరసంగా లేచి వెళ్ళబోయింది.

"అత్తయ్యా..."

ఆమె వెనక్కి తిరిగింది.

"ఒకవేళ... ఒకవేళ చిత్రకు అనాదరణ జరిగితే మీరు... మీరు నన్ను..."

ఆదరంగా నవ్వింది ఆమె.

'ఈ ఇంటి తలుపులు ఎప్పుడు తెరచే వుంటాయి నీ కొరకు' అన్నట్టు నవ్విందామె.

* * * * *

ఆనాడు తను అంగీకారం తెలిపినందుకు ఈ రోజు పశ్చాత్తాపపడుతూ చిత్రను ఎత్తుకుని భర్త దగ్గరికి నడిచింది విశాలి.

"నేను వెళ్ళిపోతున్నాను."

"విశాలీ!" ఆశ్చర్యంగా, ఆర్ద్రంగా పిలిచాడు మూర్తి.

విశాలి మాట్లాడలేదు.

"నన్నర్థం చేసుకో, విశాలీ! ఆ పిల్లను చూస్తున్నప్పుడల్లా నీ హృదయంలో నాకు రెండో స్థానమనే నిజం నన్ను పిచ్చివాడ్ని చేస్తూంది. చిత్ర నా కళ్ళముందు తిరుగు తున్నంత కాలం నిన్ను నేను మనస్ఫూర్తిగా స్వీకరించలేకపోతున్నాను.

"మీరు నన్ను పెళ్ళి చేసుకునేనాటికి నేను వివాహితననీ, భర్తవిహీననననీ, బిడ్డకు తల్లిననీ తెలిసే చేసుకున్నారు. ఇందులో అత్తయ్య దాచిపెట్టిందేమీ లేదని మీకు తెలుసు" ఎటువంటి ఆవేశంగానీ, నిష్ఠూరంకానీ లేకుండా చెపుతున్న భార్యవైపు క్షణం చూచి... "నేను... నేను నిన్ను నిందించడం లేదు విశాలీ! నా సంకుచితత్వానికి నన్ను నేను దూషించుకుంటున్నాను. ఆ పిల్లకు తండ్రిగా నిలబడడానికి శాయశక్తులా ప్రయత్నించి ఓడిపోయాను."

ఆమె మెల్లగా తల ఎత్తింది.

"చిత్రకు మీరు మమకారాన్ని పంచి ఇవ్వలేకపోయినందుకు నేను బాధపడటం లేదు. కేవలం తండ్రిగా బాధ్యత స్వీకరించండి చాలు."

అతనీ మారు కాస్త పరుషంగా చూసాడు.

"చెప్పానుగా... నా వల్ల కాలేదని."

విచారంగా నవ్వింది విశాలి. "పోనివ్వండి, నా అదృష్టం ఇంతే అనుకుంటాను."

"అంటే... నాకంటే ఆ పిల్ల నీకెక్కువన్న మాట."

విరక్తిగా నవ్వింది విశాలి.

"ఆ రోజు... 'మూర్తి నిన్ను చేసుకోవాలనుకుంటున్నాడ'ని... అత్తయ్య అడిగినప్పుడు ఆదర్శాలు, ఆశయాలతో కాకుండా నన్నూ, నా బిడ్డనూ సహజంగా తన జీవితంలోకి అహ్వానించే పనైతే నా కభ్యంతరం లేదత్తయ్యా? అని చెప్పాను. ఈ విషయాన్ని అత్తయ్య మీ దగ్గరనుండి దాచి ఉంటుందని నేననుకోను. మీరు మనస్ఫూర్తిగా చిత్ర బాధ్యత స్వీకరించి ఉండినట్లయితే, చిత్రేకాదు, దేవుడు కూడా మీ కంటే నాకెక్కువయ్యేవాడు కాదు."

అతను అదేమీ వినిపించుకోలేదు.

"మీతో జీవితం నాకెంతో ప్రీతిపాత్రమయింది. కానీ, ఇది నా సుఖం. చిత్ర నా బాధ్యత. అది నా కడుపునపడిన దోషానికి దాన్ని శిక్షించలేను. నా జీవితం కొరకు చిత్ర జీవితాన్ని చీకటిమయం చెయ్యలేను."

"కవిత్వం చెప్పకు. ఆ పిల్లను ఎక్కడి కెళ్ళమంటున్నాను... వాళ్ళ నాన్నమ్మ దగ్గిరకేగా?"

తిరస్కారంగా చూసింది విశాలి. "మీ సలహాకు కృతజ్ఞతలు. నాయనమ్మ ఎల్లకాలం జీవించదు. ఆ తరువాత తల్లి ఉండీ లేనట్టు చిత్ర ఒంటరిగా ఉండటం నేను ఊహించలేను."

"అయితే, బుజ్జాయిని వదులుకోడానికి నీకభ్యంతరం లేదన్నమాట. ఇక్కడ మాతృత్వం ఎక్కడికెళ్ళిపోయిందో?" వ్యంగ్యంగా అతను మాట్లాడుతున్న తీరుకు విశాలి హృదయం దెబ్బతింది.

"వాడు... వాడికి కొండంత తండ్రి ఉన్నాడు. పైగా వాడు మగవాడు. ఎక్కడున్నా, ఎలా ఉన్నా సంఘానికి సంజాయిషీ ఇచ్చుకోవాలసిన అవసరం లేని మగపుట్టుక వాడిది. కానీ, కానీ... చిత్రకు నేను తప్ప ఎవరున్నారు?" అలా అంటుండగానే కంటి నిండా నిండుకున్న నీళ్ళు కంఠాన్ని ఆపేశాయి.

కొద్దిసేపు తరవాత తేరుకుంటూ తనలో తను గొణుక్కుంటున్నట్టుగా అంది... "ఒక బిడ్డకు తల్లినై జీవితాన్ని ఎలానో వెళ్ళమారుస్తున్న నన్ను... ఆ భగవంతుడు మీ జీవితంలోకి నెట్టి ఎంత తమాషా చేస్తున్నాడో చూడండి. ఇద్దరి బిడ్డలకు తల్లిగా బతకడానికి సర్వ అర్హతలనూ పోగొట్టుకున్నాను."

ఆమె సన్నగా రోదిస్తుంటే అతను విసురుగా వెళ్ళిపోయాడు.

* * * * *

"నాన్సెన్స్. తట్టెడు సానుభూతి, కడివెడు కన్నీళ్ళు కావాలి ఈ రచయితలకు. దాన్ని చూచి ద్రవించిపోయి ప్రైజులిచ్చేస్తారు ఈ పత్రికలవాళ్ళు. ఇలాటి రచయితలు సంఘానికి చీడపురుగులు. వీళ్ళను బహిష్కరించి పారేయాలి" అని విసురుగా పత్రిక పారేసిన స్నేహితునివైపు చిత్రంగా చూస్తూ, "ఏం... ఈ కథ నీకు నచ్చలేదా?" అని అడిగాడు మురళి.

"నీకీ కథ నచ్చిందా?" ఆశ్చర్యంగా చూచాడు రోహిణి.

"ఏం? ఎందుకు నచ్చదు? ఇంతలా హృదయాన్ని కదిలించే కథ ఈ మధ్య రానేలేదు. హృదయాన్ని స్పందించి, మనచేత కన్నీళ్ళు కార్పించే ఈ కథ నచ్చలేదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది."

తిరస్కారంగా నవ్వాడు రోహిణి.

"నిజమే. కన్నీళ్ళు కార్పించడానికి, మీలాటి తెలివి తక్కువ మనుషుల హృదయాల్ని కదల్చడానికి పనికి రావలసిందే. ఆ తరువాత పకోడా పొట్లాలు కట్టు కోడానికి కూడా పనికివస్తుంది." అక్కసుగా అంటున్న స్నేహితుడిని నిశితంగా చూస్తూ, "అయితే నీకెక్కడ నచ్చలేదో చెప్పు వింటాను" అన్నాడు నవ్వుతూ మురళి.

"అసలు నచ్చడానికి ఏముంది ఇందులో? ఆడపిల్లకు ద్వితీయ వివాహం ఆమోదంకాదని, ఆచరణకాదని చెప్పడమేగా? అదేగా మనం వినాలి. రెండో పెళ్ళి చేసుకున్న ఆడది సుఖపడలేదని, అతగాడు ఆమెను అర్థం చేసుకోలేదని... కాబట్టి ఓ ప్రజలారా! మీరు కళ్ళు తెరవండి. నాగరికత పేరిట ఆడపిల్లలకు రెండో పెళ్ళి చేయకండి అనేదేనా ఆ కవిగారు మనకి ప్రబోధిస్తున్నది? మనల్ని ఆచరించమంటున్నది?"

"ఆవేశపడకు, రోహిణీ! మనం నువ్వు కలలు కనేంత ముందుకింకా పోలేదు. మనం బతుకుతున్నది పాత... కొత్తల కలయికలో, సంధి యుగంలో అని మరిచి పోతున్నావు" అన్నాడు మురళి.

"నేనొప్పుకుంటాను. కాని, ఇలాటి సమాజానికి మీ కవి ఇస్తున్న సందేశమేమిటి? ఈ కథ చదివినందువల్ల మనకి ఒరిగే లాభమేమిటి?"

"ఆవేశంలో నువ్వు సరిగ్గా అర్థం చేసుకోవడంలేదు. విశాలికి రెండో పెళ్ళి చేయడంలో కవి ఆదర్శం చూపించాడు. ఆమెను అతని దగ్గిరనుండి విడదీయటంలో మన ప్రస్తుత సమాజ నిజవ్యవస్థను తెలిపాడు."

"ఊహు. అది... అది కవి ఇవ్వవలసిన ముగింపు కాదు. సమాజాన్ని ముందుకు నడపవలసిన రచయిత చెయ్యవలసిన రచనకాదు ఇది" సాలోచనగా తల అడ్డంగా ఊపాడు రోహిణి.

"అయితే రోహిణీ! నువ్వే ఈ కథకు రచయిత వయ్యుంటే ముగింపు ఎలా చేసుందువు?" సన్నగా నవ్వుతూ అడిగాడు మురళి.

"నేనా... నేనయితేనా. కథను ఇంకొన్నాళ్ళు ముందుకు జరిపేవాడిని. మూర్తి, విశాలి కలిసి చిత్రను హృదయ పూర్వకంగా కన్యాదానంచేసే దృశ్యంతో ముగించేవాడిని. ఆ తండ్రిని అతి సామాన్యుడిగా, బాధ్యతగల తండ్రిగా, ప్రేమించే మానవుడిగా మాత్రమే చిత్రించేవాడిని. లేదా తండ్రి క్రూరత్వం అతనిలో పెట్టవలసివస్తే ఏ ఒక్క పాఠకుడి సానుభూతీ అతనికి అందకుండా అతి జాగ్రత్తగా అతని పాత్రను మలచేవాడిని. నా దృష్టిలో మూర్తి క్షమార్హుడు కాడు...."

నవ్వాడు మురళి.

"అది అసహజమయిపోతుంది. నీ కలగా మాత్రమే మిగిలిపోతుంది."

విచారంగా చూచాడు రోహిణి.

"నిజమే! ఈ కాలానికి ఇది అసహజం కావచ్చు కానీ, నాకు నమ్మకముంది. ముందు కాలానికి ఇది సహజమై తీరుతుంది. ఆనాడు రాజారామమోహన్ ఎదిరించిన సతీ సహగమనం ఆనాటికి అసహజమైంది. ఆ నాటికి సహజం కాలేదూ?"

"ఈ కాలం.... ముందు కాలానికి సహజం కాబోతున్నప్పుడు కలల్లో బ్రతకడంలో తప్పేం లేదు. మరో వీరేశలింగం పంతుల కొరకు ఎదురుచూస్తూ చెత్తకథలు వ్రాసేకంటే, మనం కలల్లో బ్రతుకుతూ, మన ఊహాజనితమైన ఇతివృత్తాల్ని పాఠకులకు అందిద్దాం. ఆశయంగా, అభ్యుదయంగా, ఆదర్శంగా కాదు మురళీ అది అతిసహజం అన్నట్టుగా వ్రాయాలి. ఆశయాలు, ఆదర్శాలూ కూడుపెడతాయా? అనే దశకు దిగజారిపోయున్నాం మనం. వీరేశలింగంపంతులు కూడా మన సమాజం ముందు ఓడిపోయారు. కనక ఈ కాలానికి అసహజమనుకున్నది కూడా సహజం కింద రూపుదిద్దండి. మీరు.... కొంత కాలం అసహజమని పాఠకులు గోలపెడితే పెట్టొచ్చు. కానీ, నా ఆశ నాకుంది. అదే పనిగా అలాటి భ్రమాచ్ఛన్నమైన కథలు చదువుతుంటే కొంత కాలానికి భ్రమ నిజమవుతుంది."

"అదే వాళ్ళకు కూడా అతి సహజంగా, వాంఛనీయంగా అనిపిస్తుంది. మన సమాజంలో ఏ వ్యక్తీ హృదయపూర్వకంగా మరో వ్యక్తి సంతోషం, శాంతి, సౌభాగ్యం పునరుద్ధరింపబడుతుంటే అసూయపడడు. కాకపోతే మన ఛాందసాలు మనల్నింకా వదలలేదు. కనుక, కేవలం మనిషి ఆరోగ్యాన్ని కూడా దయ్యంగా భావిస్తున్న ఈ రోజుల్లో ఈ తిరుగుబాటు, ఈ విప్లవం మనల్ని ఏ నరకకూపానికి లాగుతుందోననే మరోజన్మ భీతితో వెనక్కే అడుగేస్తున్నారు. అలాటి అమాయక ప్రజల్ని ముందుకు నడిపించ వలసిందిపోయి వెనక్కి నడిపిస్తున్న మన రచయితలు సంఘానికి చీడపురుగులు. కేవలం పాఠకుల సానుభూతికొరకు కథానాయకురాలిచేత కడివెడు కన్నీళ్ళు కార్పించి పురాణ స్త్రీల జాబితాలోకి ఆమెను తోసేసి పాఠకులచేత ఇన్ని కన్నీళ్ళు కార్పించి మంచి సెంటిమెంటల్ స్టోరీ అనిపించుకోవాలనే ప్రలోభంనుండి ఈ రచయితలు ఎప్పుడు బయటపడతారో అప్పటికిగాని ఈ సాహితీ సమాజానికి విముక్తి లేదు."

ఆయాసంగా ఆగాడు రోహిణి.

"కానీ మన సంస్కృతి..." అని ఏదో చెప్పబోయి ఆగి, "పోనీలేవోయ్. ఈ కథ మీద మన వూపిరి ఖర్చు పెట్టుకోవడం ఎందుకు? ఎయిర్ కండిషన్ హాలులో పిక్చరు బ్రహ్మాండంగా ఉంది. మరోసారి వెళ్దామేమిటి? నీ ఆవేశం కాస్తయినా తగ్గుతుంది."

ఏదో అనబోతున్న రోహిణి చటుక్కున ఆగిపోయి.... "ఏమిటి? ఏమిటంటున్నావు నువ్వు?" అని మురళివైపు కుతూహలంగా చూచాడు.

"అదే పిక్చరు... ఎయిర్ కండిషన్ హాలు..."

"ఆగు ఆ పిక్చరువల్ల ప్రేక్షకులు నేర్చుకోగలిగిందేమిటో కాస్త చెబుతావా... వింటాను."

"ఏముందంటే... అయినా, నీకిదేం బుద్ధి. ప్రతిదాంట్లోనూ విపరీతార్థాలు తీస్తావు?

"పోనీ నేను చెబుతాను... వింటావా?"

"చెప్పు. కాలక్షేపమన్నా అవుతుంది" తేలిగ్గా నవ్వాడు మురళి.

"కాలక్షేపానికి కాదు. కాస్త సిన్సియర్‌గా విను. నీకు కూడా ఆ పిక్చరు నచ్చిదంటే నాకు చాలా విచారంగా ఉంది."

"ఓ మంచి అమ్మాయి. ఊరంతటికీ నచ్చినమ్మాయి. ప్రతివ్యక్తికీ దేవతలాటి అమ్మాయి.... భర్తను పోగొట్టుకుంది. ఆ ఊరంతా కలిసికట్టుగా అసహజంగా ఆ అమ్మాయికి ఆ విషయాన్ని తెలియనీకుండా రహస్యంగా ఉంచారు. తన భర్త పరాయి ఊరిలోనే ఉన్నాడనే భ్రమలో ఉన్న ఆ పిల్ల ఒకరోజు హఠాత్తుగా, తన భర్తలాటి డాక్టరును చూచి తన భర్తే అనుకుంటుంది. అసలే మానసిక బలహీనతలో వున్న ఆ అమ్మాయి తన భర్తకాదనే నిజాన్ని తెలుసుకుంటే పిచ్చిదైపోతుందనే ఉద్దేశంతో కొంత కాలంపాటు ఆ డాక్టరు ఆమెకు భర్తగా నటించడానికొప్పుకుంటాడు. ఆమెకు మనోబలం వచ్చిన తరువాత నిజం చెప్పాలనేది వాళ్ళ ఉద్దేశం అయితే కావచ్చు. కానీ, ఒకరోజు హఠాత్తుగా ఆ కథానాయికకు అసలు విషయం తెలిసిపోతుంది. తలుపులు తెరవ బడ్డాయి. తెరవబడిన తలుపుల మధ్యగా సింధూర హీనమైన ముఖంతో, తెల్లటి చీరతో జుట్టు వేలుముడి వేసుకొని దైన్యమూర్తిలా నిశ్చలంగా నిలుచోనుంటుంది. ఆ దృశ్యం చూచి నేను చలించిపోయిన మాట వాస్తవమే. కానీ, కేవలం మామూలు మనుష్యులం మనం. భర్తను పోగొట్టుకున్న స్త్రీ బొట్టు పెట్టుకోగూడదు, రంగు చీరలు కట్టకూడదు అంటే అవును కాబోలు అని ఊరుకునే మూఢులం మనం. ఇలాటి మనల్ని నడిపించ

వలసిన రచయితలు కూఆ చేయవలసిందీపనేనా? వాళ్ళూ మనుష్యులేనని, వాళ్ళకీ కోరికలుంటాయని పోనీ నైతికమైన విలువలను తగ్గించే కోరికల మాటటుంచినా, కనీసం ఇన్నేళ్ళగా పెట్టుకున్న పూలూ, దిద్దుకున్న తిలకమైనా వాళ్ళకందిద్దామని ఎందుకు అనుకోరు వీళ్ళు? ఇంకా మనల్ని వెనక్కి నడపడమేనా వీళ్ళు చేయవలసింది? అడుగు ముందుకు వేయాలనుకున్న వాళ్ళకు వీళ్ళిచ్చే పిరికిమందా ఇది! పూలు పెట్టుకున్న బాలవితంతువు, నుదుట సింధూరం దిద్దుకున్న పాతికేళ్ళ విధవ ఈ సినిమాలో ఆఖరు సీనుచూచి పశ్చాత్తాప పడమనేనా వీళ్ళు చెప్పదలచుకుంది? ఆమె తలలో పూలు పాముల్లా మారిపోవూ? నుదుట సింధూరం రావణాసురుడి కాష్టంలా కాలిపోదూ?"

"అది కాదు" అని ఏదో చెప్పబోతున్న మురళీ నాపుతూ అన్నాడు.

"అడ్డుపడకు. నన్ను చెప్పనీ ఇంకా క్లైమాక్సుకు రాలేదు. ఈ కథలో అసలు ప్రయోజనమేమిటో తెలుసా? భర్తను పోగొట్టుకున్న స్త్రీ బ్రతకడానికి అనర్హురాలన్నట్టు పుటుక్కున ఆఖరు సీనులో కథానాయకురాలిని చంపేసి మంచి సెంటిమెంటల్ రచయిత అనిపించుకున్నాడు. ఆ వెధవ కథను సినిమాతీసి ప్రేక్షకుల్ని ఏడిపించి డబ్బు పోసుకున్నాడు నిర్మాత. అక్కడ స్వర్గంలోచేరి వీరేశలింగం పంతులు, రాజా రామ మోహన్‌రాయ్ కంటికి కడివెడు ఏడుస్తున్నారు."

"ఆవేశపడికోకు, ఇది కథరా రోహిణీ."

రోహిణి ఆవేశానికి మురళి నవ్వుకున్నాడు.

"కథే కావచ్చు. కానీ, దానికొక ప్రయోజనముండక్కరలేదా? ఓ వ్యభిచారిణి, సంఘ విధూర సంతానం, భర్తను పోగొట్టుకున్న ఓ పసిపిల్ల.... స్త్రీ కింత క్షేమకరమైన నీడచూపెట్టలేని ఈ దౌర్భాగ్యపు సంఘంలో దురాగతానికిలోనై శీలం పోగొట్టుకున్న ఓ పడతి... వీళ్ళంతా బతకడానికి అయోగ్యులా? వీళ్ళ జీవితాలకు ముగింపు మరణ మొక్కటేనా? మీరు, రచయితలు... పాఠకులకు, ప్రేక్షకులకు అందిస్తున& సందేశమా ఇది? అలా వాళ్ళను పిరికి వాళ్ళనుచేసి వెనక్కి నడిపి మీరు గొప్ప సెంటిమెంటల్ కథారచయితలు అనిపించుకోడానికి మీకు సిగ్గనిపించడం లేదూ? మరణం ముగింపు కాకపోతే నిమిషాలు, గంటలు దుర్భరంగా, నిరర్థకంగా బతకమనా మీరు వాళ్ళను శాసిస్తున్నారు? ఇదా రచయితగా మీరు సమాజానికి చేస్తున్న సేవ? కేవలం పొట్టకూటి కొరకు, కీర్తికొరకు ఆదర్శాలకు పిరికిమందు పోయడం... ఛీ ఛీ మీ కలానికే సిగ్గు.... చాదస్తాలతో కుళ్ళిపోతున్న నీ సమాజాన్ని మరమ్మత్తు చేసే శక్తి నీ కలానికి లేకపోతే ఇంకు దండుగ. చేతులు ముడుచుకుని హాయిగా ఇంట్లో కూర్చో."

ఆయాసంగా ఆగాడు రోహిణి.

"నీ ఆశయం గొప్పదే, రోహిణీ! కాని మన సమాజం ఇంకా ఎదగనప్పుడు ఎదిగినట్టు మనం వ్రాసేస్తే దానిద్వారా రచయిత ఎదుర్కోవలసిన చిక్కులు చాలా వుంటాయి. అంత బాధ్యత...."

"రచయితమీద పెద్ద బాధ్యతే ఉంది, మురళీ! బాధ్యతకు భయపడితే ఎలా? బాధ్యతనుండి పారిపోతే ఎలా? కాలక్షేపానికి చదువుకునే కథలు కొన్ని ఉంటాయి. అలసిపోయిన మనస్సుకు విశ్రాంతినిచ్చే తేలిక కథలు గురించి కాదు నేను మాట్లాడేది? ప్రైజులు, అవార్డులు కొట్టేసిన రచయితలు ఇంత బాధ్యతా రహితులైతే ఎలా?"

మురళి కాస్త అసహనంగా సీట్లో కదిలాడు. తన స్నేహితుడికి తను చెబుతున్నది అంతగా నచ్చలేదని రోహిణికి అర్థమయ్యింది.

"పోనీ నేను చెబుతోంటే నీకు విసుగ్గా ఉన్నట్టుంది. నీ అభిప్రాయం చెప్పు మురళీ, వినాలని ఉంది."

మురళి మాట్లాడలేదు.

"పోనీ నీకు ఏ కులంగాని అమ్మాయో నచ్చిందనుకో. ధైర్యంచేసి పెళ్ళాడేయవూ? అలాగే...."

"అయ్యబాబోయ్! మా వాళ్ళసలే ఛాందసులు. అలాటి ప్రస్తావనే మా ఇంట్లో రావడానికి లేదు. అందరినీ ఎదిరించి... ఎందుకు వచ్చిన అశాంతిలెద్దూ?"

* * * * *

"రోహిణీ!"

ఉలిక్కిపడి తేరుకున్నాడు రోహిణి.

"నువ్వేదో ఆలోచిస్తున్నావు?"

"నువ్వు... నువ్వు ఎలా మారావా? అని" కుతూహలంగా చూశాడు రోహిణి.

ఏ భావమూ వ్యక్తం చేయకుండా నవ్వాడు మురళి.

"అయినవాళ్ళ కన్నీళ్ళు కథల్లోలా... సినిమాల్లోలా తీయగా ఉండవని తెలుసుకున్నానంతే."

"అంటే?"

రాజేశ్వరి శ్రోతగా మిగిలిపోయింది.

కొద్దిక్షణాలు మురళి మాట్లాడలేదు. తరవాత మెల్లిగా కాతర కంఠంతో అన్నాడు.

"మా చిన్న చెల్లి త్రిపుర తెలుసుకదూ?"

"ఆ. ఆ పిల్ల దురదృష్టం కూడా తెలుసు."

"ఆ పిల్ల... ఆ పిల్ల..."

"ఆఁ ఏమయింది ఆ అమ్మాయికి?" ఆత్రంగా అడుగుతున్న స్నేహితుడివంక విచారంగా చూస్తూ అన్నాడు మురళి.

"చెబుతాను, చెబుతాను. అసలీ విషయాన్ని ఎవరితోనూ చెప్పకపోతే నేను భరించలేననిపిస్తోంది."

"ఒకరోజు మా పెద్దవదిన తమ్ముడు పరశురామ్ చేసిన ప్రతిపాదనతో ఇంట్లో అందరం దిగ్భ్రాంతిలో మునిగిపోయాం."

"నేను త్రిపురను పెళ్ళిచేసుకుంటాను."

ఆ హాలులో ఉన్నవాళ్ళలో మా చిన్న వదిన కళ్ళల్లో చిన్న మెరుపును, మా చిన్న చెల్లి కళ్ళల్లో సన్నటి సిగ్గు తెరను అంతటి దిగ్భ్రాంతిలో కూడా నేను గమనించకపోలేదు.

"ఏమయినా అభ్యంతరం ఉంటే త్రిపురకు తప్ప మరెవ్వరికీ ఉండదని భావిస్తాను."

అంతవరకు ఆ ఇంట్లో పెద్ద వదిన తమ్ముడుగా, అతిథిగా అతి ఆదరంగా చూడబడుతున్న అతను ఆ క్షణంలో మాకు కుట్రదారుగా, కుసంస్కారిగా, విలన్‌గా అనిపించాడు. ముందుగా మా పెద్ద వదిన తేరుకుంది.

"రామూ! ఏమంటున్నావు నువ్వు?"

మా చిన్న వదిన చాలా తెలివి గలది. మా అందరి ముఖాల్లో దిగ్భ్రాంతికి కారణం ఇట్టే పసిగట్టేసింది. మెల్లగా పెద్ద వదిన దగ్గిరగా నడిచి వచ్చి, "రాము ఏమంటున్నాడో నీకు నిజంగానే అర్థం కాలేదా, అక్కా?" అంది.

"అది కాదు, సీతా! వాడంటున్నది ఏమయినా సమంజసంగా ఉందా?"

చిన్న వదిన నవ్వింది. ఆ నవ్వులో అర్థాలు వెతుక్కుంటే మా అందరికీ చాలా బోధపడి ఉండాలి. కానీ, మేమందరం ఇంకా స్పృహలోకి రాలేదు. పెద్ద వదిన కంగారు పడిపోతూ మా పిన్నమ్మ దగ్గిరికి వచ్చి, "వాడు చిన్నవాడు మీరు మరోలా భావించకండి అత్తయ్యా!" అని ప్రాధేయపడింది.

"అక్కా! రాము చిన్నవాడని నువ్వు సమర్థించుకుంటే అది ఆత్మ ద్రోహమే అవుతుంది. అతడు ప్రాజ్ఞుడయ్యాడు. అతనినే మాట్లాడనివ్వండి."

"నువ్వు ఊరుకో సీతా! నీకు తెలీదు. మన కుటుంబానికిది ఎంత తలవంపు? పైగా వాడు నా తమ్ముడై పోయాడు."

చిన్న వదిన పెద్ద వదిన భయాన్ని కొద్దిగా అర్థం చేసుకుంది. "అక్కా! అతను నీకు తమ్ముడు కావచ్చు. అతని భావాలు మాత్రం నీవి కావు. ఇందులో నా దోషముంటుందని మేమెవ్వరం అనుకోవడం లేదు."

పెద్ద వదిన మాట్లాడలేదు.

చిన్న వదిన పరశురామ్ వైపు చూసింది. తను చెప్పవలసింది చెప్పేసి వినవలసింది మటుకే మిగిలినట్టు దృఢ సంకల్పంతో ఉన్న అతను, మరి మాట్లాడ వలసింది ఏమి లేనట్టు నిశ్శబ్దంగా వెళ్ళి ఒక ప్రక్కగా కుర్చీలో కూర్చున్నాడు. మా చిన్న వదిన చూపులు త్రిపురవైపు తిరిగాయి. ఆమె ముఖం లజ్జాభారంతో వాలి పోయింది. మెల్లిగా ఆమె కాళ్ళు ఆ హాల్లో నుండి కదిలి వెళ్ళిపోయాయి.

చిన్న వదిన అందరివైపూ ఒక్కసారి నిశితంగా చూచి మా నాన్నగారికి కనపడ కుండా ఒక పక్కగా ఒదిగి పిన్నితో అంది.

"అత్తయ్యా! పరశురామ్ మన త్రిపురకు మరో సౌభాగ్యమైన జీవితాన్ని ఇస్తానంటున్నాడు. మీరేమంటారు?"

పిన్ని నోరు విప్పింది.

"అదేమిటే, సీతా! ఇలాటివి మన ఇంటా వంటా ఉన్నాయా! ఎవరైనా వింటే ఎంత అప్రతిష్ట?"

అలాటి మాటలు అత్తగారి దగ్గిరనుండి విన్నాక ఇక ఆమెకు నచ్చచెప్పటం మూర్ఖత్వమే అవుతుందనుకుందేమో.

"మామయ్యా! మీరేమంటారు?" అంది వదిన.

"అమ్మా, సీతా! ఈ సంభాషణను ఇంతటితో ఇక ఆపుచేయండి. ఇది జరిగేది కాదు. అసలు జరక్కూడదు. ఇంకా మాట్లాడి చిన్నమ్మాయి మనస్సు పాడుచేయకండి" అనేసి ఆయన తన గదిలోకి వెళ్ళిపోయారు.

చిన్న వదిన ముఖంలో బలమైన నిరాశ స్పష్టంగా కనిపిస్తూంది. అయినా, పట్టుదల వదలకుండా మా ఇంట్లో ప్రతి ఒక్కరినీ పేరు పేరున అడిగింది. అందరు తల అడ్డంగా ఊపారు.

"మురళీ! నువ్వేమంటావు?" నా దగ్గరికి వచ్చి ఆశగా అడిగింది వదిన. నేను మౌనంగా తలవంచుకున్నాను.

నా వైపు నిరసనగా చూసింది.

"నువ్వు... నువ్వు రచయితవు. నీ దగ్గిరనుండి కూడా ఈ జవాబు నేనాశించ లేదు, మురళీ!" అంది అధీరంగా.

ఈ తతంగానికి పెద్ద వదిన భయపడిపోయింది. గబగబా తమ్ముడి దగ్గిరికి నడిచింది.

"చాలు, నాయనా! నువ్వేదో మంచివాడవని నా ఇంట్లోకి రానిస్తే, మంచి ఘనకార్యమే చేశావు. నీకు దండం పెడతాను. ఇక్కడనుండి వెళ్ళిపో. మరి నా ఇంటి కెప్పుడూ రాకు" పెద్ద వదిన ఆవేశంగా అరిచింది.

పరశురామ్ అభిమానం దెబ్బ తిన్నట్టుంది. చివాలున కుర్చీలోనుండి లేచాడు.

"ఆగు రామూ. వీళ్ళందరితో నీకు పనేమిటి? త్రిపుర కాదంటే అప్పుడు వెళ్ళిపోదువు కాని."

చిన్న వదిన పరుగులాంటి నడకతో లోపలికి వెళ్ళి ఇంచుమించు త్రిపురను రెక్క పట్టుకుని ఈడ్చుకుని వచ్చింది.

"చెప్పు; త్రిపురా, రాము నీకు మరో మంచి జీవితమిస్తానంటున్నాడు. మన సమాజంలో నువ్వు రంగు చీరలు కట్టుకోవడానికి, నుదుట కుంకుమ దిద్దుకోవడానికి, తలలో పూలు తురుముకోవడానికి లైసెన్స్ ఇస్తామంటున్నాడు. ఏమంటావు నువ్వు?" ఆవేశంగా అడిగింది.

చిన్న చెల్లి మాట్లాడలేదు. వంచిన తల ఎత్తలేదు.

"తల ఎత్తు. ఇటు చూడు. ఇది నీ జీవిత సమస్య. ఇప్పుడు సిగ్గుపడి లాభం లేదు. ఇప్పుడు కాదంటున్న వీళ్ళంతా రేపు నిన్ను ఉద్ధరించరు. ఇటు చూచి నీ జవాబు చెప్పు."

ఈ మారుకూడా ఆ పిల్ల జవాబు చెప్పలేదు. పెదాలు మాత్రం అస్పష్టంగా కదిలాయి.

వదినలు, అన్నలు, పిన్ని ఇంతమంది మధ్యగా ఆ పిల్ల నోరు ఎందుకు కదప లేకపోతూందో సానుభూతితో అర్థం చేసుకుంది వదిన. ఆర్ద్ర కంఠంతో అంది.

"చూడు, త్రిపురా. నువ్వు గౌన్లు వేసే వయస్సులో నేను ఈ ఇంటి కోడలుగా వచ్చాను. నా కళ్ళ ఎదటే నీ పెళ్ళి జరిగింది. కానీ, ఏరి కోరి ఏర్పరిచిన ముహూర్తంలో బలమే మృగ్యమయిందో, పెద్దల ఆశీస్సులతో సత్యమే కొరవడిందో కొన్ని నెలలు తిరక్కముందే భర్తను పోగొట్టుకున్నావు. ఆయన కొరకు కొన్నాళ్ళు ఏడిచావు. ఆ తరవాత

నీ కొరకు ఏడ్చుకొన్నావు. కానీ ఈ రోజు... నువ్వు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసిన రోజు వచ్చిందమ్మా... చావు ఎంత సహజమైందో ప్రీతిపాత్రులయిన వాళ్ళ మృతి మనకందించే దుఃఖమూ అంతే సహజమైంది. అంతేకాని, ఆ దుఃఖంలో జీవితాంతం కుళ్ళిపోవడమనేది తెలివి తక్కువ పని."

త్రిపుర మాట్లాడలేదు. కళ్ళెత్తి వదినవైపు చూచింది. ఆ కళ్ళనిండా నీళ్ళున్నాయి.

వదిన చలించిపోయింది. త్రిపురను అక్కున చేర్చుకుంది. కొన్ని సెకండ్ల తరవాత ఆ పిల్ల కళ్ళనీళ్ళు తుడుస్తూ అనునయంగా అంది.

"చూడమ్మా, ఇది ఏడవవలసిన సమయం కాదు. ఇప్పుడు నువ్వు ధైర్యం చేయకపోతే జీవితాంతం బాధ పడవలసి ఉంటుంది. అవునో, కాదో నీ జవాబు చెప్పెయ్యి. రామూ నీ అంగీకారం కొరకు ఎదురు చూస్తున్నాడు. రామూ ఎలాటివాడో నీకు బాగా తెలుసు."

ఈ తడవ అంగీకారంగా తల ఊపేసింది త్రిపుర. త్రిపుర చూపిన అంగీకారానికి ఆ ఇంట్లో ఉన్న అందరిమతులూ పోయాయి. మా పెద్దక్క అంతవరకు మౌనంగా, చికాగ్గా వింటున్నదల్లా చటుక్కున వచ్చి త్రిపుర ఎదురుగా చతికిలబడుతూ, "చిన్నా, మాకు మాత్రం నిన్నిలా చూస్తుంటే గుండె తరుక్కుపోవడం లేదూ? కానీ, ఈ పనిని లోకం హర్షించదమ్మా" అంది. త్రిపుర జవాబు చెప్పలేదు. కానీ, వదిన ఊరుకోలేక పోయింది. "ఏం వదినా లోకం ఎందుకు హర్షించదు? త్రిపుర పెళ్ళికి ముందు ఆ పిల్లకు ఇంకా పదహారేళ్ళన్నా నిండకముందు, పిల్లకు పెళ్ళెప్పుడు చేస్తారని, ఆ పిల్లకు పెళ్ళి అనివార్యమైనట్టు మనల్నంతా ఊదరగొట్టేసిన ఈ శ్రేయోభిలాషులంతా ఎందుకు ఆమోదించరంట? అనాడు ఆ పిల్లకు కావలసివచ్చిన నీడ ఈనాడు అవసరం లేదా? అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా? కేవలం రెండు సంవత్సరాలు. ఆనాడు పిల్లని ఇంకా ఎన్నాళ్ళు ఇంట్లో పెట్టుకుంటారని అడిగిన మన బంధుజనం ఈనాడు ఈ పిల్ల భారాన్ని మనం దింపుకుంటూంటే, ఆనందించరంటావా?" విసురుగా అంటున్న వదిన మాటల్లో ఎంత జాగ్రత్తపడినా, వ్యంగ్యం తొంగిచూస్తూనే ఉంది. పెద్దక్క వదినవైపు నిర్లక్ష్యంగా చూసి, మళ్ళీ చెల్లెలివైపు తిరిగి అనునయిస్తూ అంది.

"చూడు చిన్నా. నీది దురదృష్టమే, ఒప్పుకుంటాను. మరిదిని మరిచిపోయి మరో పెళ్ళి చేసుకుంటాననడం ఏం బాగాలేదమ్మా. ఈ తుచ్ఛమైన శరీర సుఖాల దేముంది? మరిది తాలూకు మధుర స్మృతులు చాలవూ నువ్వు బతికేయడానికి."

ఈ తడవ చిన్న వదిన రెచ్చిపోయింది.

"ఎందుకు బ్రతికేయలేదూ? మీ చెల్లెలి కింత చోటిచ్చిన పుట్టింట్లో మరి కొంత

చోటు మీకు దొరక్కపోతుందా? అన్నగారిని వదిలేసి మీరూ వచ్చేయండి. ఆయన మధుర స్మృతులతో బ్రతికేద్దురుగాని."

అక్క ఏడవటం మొదలెట్టింది.

"చూడు! పిన్నీ, సీత ఎంత మాటందో!"

వదినకు స్పృహ వచ్చినట్లయింది. చప్పున పెద్దక్క చేతులు పట్టుకుంటూ "తప్పయిపోయింది. నోరు జారాను. ఏమనుకోకండి. వదినా" అంది దీనంగా.

పిన్ని జాలిగా పెద్దక్క వైపు చూసింది. తిరిగి చిన్న చెల్లివైపు జాలిచూపుతో చూస్తూ అంది.

"పిచ్చిపిల్లా, జారిపోయిన సుఖం మళ్ళీ రమ్మంటే వస్తుందా? దానికి ఆశపడడం మన అవివేకం."

"నిజమే నత్తయ్యా. అందరినీ అన్ని అదృష్టాలు వరించవు. లోకంలో దురదృష్ట వంతులు, విధి వంచితులు చాలా మందే ఉన్నారు. కానీ అదృష్టం వరించి వస్తున్నప్పుడు కాదనడం అవివేకం కదూ?"

ఎవరూ ఏమా మాట్లాడలేదు.

"ఆరు నెలల క్రితం నాకు సంజయ్ పుట్టినప్పుడు మీరంతా ఎంతో సంతోష పడ్డారు. 'పోనీలే సీత దుఃఖం ఈనాటితో తీరింది.' అని నా చనిపోయిన బిడ్డను తలచుకుని నా అశాంతి తొలగిపోయినందుకు ఎంత సంబరపడ్డారు! నిజానికి సంజయ్ పుట్టాక విజయ్ దిగులునుండి నేను పూర్తిగా కోలుకున్నాను. అలాటి అవకాశాన్ని మీరు త్రిపుర కెందుకివ్వరు?" మా చిన్న వదిన డాక్టరు. స్వతహాగా మితభాషి. ఆమె ఇంతగా మాట్లాడగా మేమెవ్వరం వినలేదు. ఆమె ఎవ్వరినీ నొప్పించగా మేమెవ్వరం చూడలేదు. ఈ రోజు అతిగా మాట్లాడుతున్న చిన్న వదిన మా అందరికి కొత్తగా ఉంది. ఆమె మాటలు నాకు అప్పుడప్పుడూ సమంజసంగా అనిపించినా, మరొకప్పుడు ఎబ్బెట్టగా, అతిగా అనిపించాయి.

హాల్లో వున్న ఓ ఒక్కరు నోరుకదిపి పెద్దగా మాట్లాడ్డం లేదు. ఈ వాతావరణం ఎవ్వరికి గిట్టనట్టు వాళ్ళ మొహాలే చెబుతున్నాయి. కానీ, ఎవ్వరూ అక్కడనుండి కదల లేదు. వదినమీద అందరికి కోపంగానే ఉంది. కాని ఆమెను ఆ స్థితిలో ఎదిరించే సాహసం ఎవరికీ లేకపోయింది.

పరశురామ్ తన వినతిపత్రాన్ని మా ముందు వుంచి, నిశ్శబ్దంగా ప్రేక్షకుడుగా మాత్రం మిగిలిపోయాడు. వదినే అతని తరపున మాట్లాడుతూంది.

"చూడండి వదినా, మిమ్మల్ని అతిక్రమించి మాట్లాడుతున్నాననుకోండి. అత్తయ్య చనిపోయినప్పుడు మనందరం ఒక్కలాగ సానుభూతి చూపించబడ్డాం. ఒక్కలాగ ఏడ్చాం కానీ, త్రిపుర భర్త చనిపోయినప్పుడు అందరూ చూపించిన సానుభూతిలో త్రిపురకు ప్రత్యేక స్థానమిచ్చారు. త్రిపుర భర్తపోతే ఆ దుఃఖం మాత్రం మనదికాదూ! తల్లీ, భర్తా... ఇద్దరూ ప్రీతిపాత్రులే. కాని, త్రిపురకు ఆమె భర్తపోయినప్పుడు మనందరం అందించిన సానుభూతిలో భేదం ఉంది. బహుశ ప్రీతిపాత్రుడయిన ఆమె భర్త చనిపోయాడనే సానుభూతికంటె ఆమె భర్తద్వారా పొందుతున్న కొన్ని సుఖాలు - శారీరకంగా గానీ, మానసికంగా గానీ పోగొట్టుకున్నదనే సానుభూతి ఎక్కువగా ఉంది. ఆనాడు ఆ పసిపిల్ల ఏ సుఖం నుండి... ఏ నిండుతనంనుండి వంచించబడిందని మనమందరం విపరీతంగా బాధపడ్డామో? అదే సుఖం ఈనాడు ఆ పిల్లకందుతూంటే... మనం దానికి సంతోషంగా అంగీకరించకపోతే మన ఆనాటి ఏడ్పుకు అర్థం లేదు. ఈ పసిపిల్ల దౌర్భాగ్యానికి ఏడ్చే మన కళ్ళు, ఆ పిల్ల సౌభాగ్యానికి నవ్వగలిగినప్పుడే ఆ కళ్ళకు చరితార్థత ఉంటుంది." ఆమె ఆవేశానికి ఆమె కంఠం జీరబోయిందనుకున్నాను కానీ, ఆమె కళ్ళల్లో తడి నన్నాశ్చర్యపరచింది.

"వదినా, మా పెద్ద వదిన చచ్చిపోయినప్పుడు 'పాపం శేఖర్ భార్య లేకుండా ఎన్నాళ్ళుంటాడు?' అని సానుభూతి చూపించి మీరంతా మరలా అన్నను పెళ్ళికొడుకును చేశారే. అదే ఉద్దేశంతో ఈరోజు త్రిపుర పెళ్ళికి ఒప్పుకోండి, వదినా!" మా చిన్న వదిన ప్రాధేయపడుతోంది.

"త్రిపుర నీకు భారంగా వున్నట్టుంది. నేను దానిని తీసుకువెళతాను." పెద్దక్క మాటలకు ఉలిక్కిపడింది వదిన. చురుగ్గా చూసింది.

"ఏమంటున్నారు మీరు? త్రిపుర... ఆ పసిపిల్ల, నాకు భారమవుతుందా?"

"ఎంతయినా రక్త సంబంధం. ఆ పిల్ల గురించి మాకున్న వ్యథ పరాయివాళ్ళు... మీకెందుకుంటుంది? రేపు పొద్దున ఆ పిల్ల రెండో పెళ్ళి చేసుకున్నాక నలుగురూ కాకుల్లాపొడుస్తూంటే మేము ఆ పిల్ల కన్నీళ్ళు చూచి భరించద్దూ!" నిదానంగా చెబుతున్న పెద్దక్కవైపు విచారంగా, దీనంగా చూచింది వదిన. పెద్దక్క తిరస్కారం కూడా ఆమె కార్యదీక్షను సడలించలేదు. ఆమె వంటరిగా నిలబడి వదినను, తోడికోడలిని, అత్తను ఇంకా ఆ ఇంట్లోవున్న సర్వజనాన్ని ఒప్పించి, చిన్న చెల్లికి సౌభాగ్యకరమైన, నిత్య నూతనమైన జీవితాన్నివ్వాలని తాపత్రయపడుతూనే ఉంది. మారినలోకాన్ని గురించి చెబుతూనే ఉందికానీ, ఎవ్వరిలోనూ చలనం రాలేదు.

ఆఖరికి మా అందరివైపూ నిస్సహాయంగా చూస్తూ "ఈ రోజు నా క్లినిక్‌కొచ్చిన ఒక పేషంటును గురించి మీతో చెప్పాలని వుంది" అని గొణిగింది.

అందరం నిశ్శబ్దంగా మా అంగీకారం తెలియజేయడంతో ఆమె మొదలెట్టింది.

"నేను చెబుతున్నది పచ్చి నిజం. యథాతథంగా చెబుతున్నాను."

"ఈ రోజు ఒక అయినింటి విధవాడబడుచును రెండవసారి అబార్షన్ కొరకు నా దగ్గరికి తీసుకొని వచ్చింది ఆమె తల్లి. మొదట మారు వచ్చినప్పుడు ఆ తల్లి ఏడ్చింది. ఆ తల్లి ఏడుపుకే కరిగిపోయానో లేక ఆ పిల్ల మొదటి పొరపాటుగా తీసుకున్నానో కడుపుతీసి పంపించాను. కానీ, ఈ మారుమాత్రం అడగకుండా ఉండలేకపోయాను.

"ఆ పిల్లాడెవరో తెలుసుకొని పెళ్ళి చేయకపోయారా" అని. ఆ తల్లి ఆశ్చర్య పోయింది.

"విధవకు మళ్ళా పెళ్ళా?"

"అయితే ఇదేమిటి?" విసుగ్గా అన్నాను.

"ఏదో దాని ఖర్మ చిన్నప్పుడే ఇలా కాలింది. అందుకే చూసి చూడనట్టు ఊరుకుంటున్నాము. పసిపిల్ల."

ఈసారి ఆశ్చర్యపోవడం నా వంతయింది. ఆ ఆశ్చర్యాన్నుండి తేరుకోవడానికి చాలాసేపే పట్టింది.

"ఏమిటి వీళ్ళ ఆంతర్యం? కూతురో, అడబిడ్డో, చెల్లెలో ఎవరయినా కానివ్వండి, రోజుకొకడితో చెడిపోవడాన్ని సహించి దానిని గోప్యంగా దాచుకుంటూ, దాని పర్య వసానాన్ని డాక్టర్ల దగ్గిర గుట్టుచప్పుడు కాకుండా తీయించేస్తూ, ఇంత జుగుప్సాకరమైన దాన్ని ప్రోత్సహిస్తున్న వీళ్ళు పతి విహీన అయిన ఆమె మనస్సును పలుదిక్కులకు పోనీయకుండా మరో పెళ్ళిచేసి ఆమె మనస్సుకు, శరీరానికి కూడా ఓ స్థిరత్వాన్నివ్వడానికి ఎందుకు అంగీకరించడం లేదు? మధురమైన మాతృత్వాన్నుండి ఆ పసిపిల్లనెందుకు వంచిస్తున్నారు? వీళ్ళు" నాకర్థం కానిదల్లా ఇదే.

"నువ్వు చదువుకున్న దానివమ్మా. ఏ పరిధి వేరు. మేమంత ఎత్తుకు ఎదగలేము" నిష్ఠూరంగా అంటున్న పెద్దక్క వైపు విసుగ్గా, తిరస్కారంగా చూచింది వదిన.

"నేను చదువుకున్న దానిలా మాట్లాడ్డం లేదు, వదినా మనిషిగా మాట్లాడుతున్నా నంతే. ఈ రోజు జరిగిన సంఘటన మిమ్మల్ని కదిలించడం లేదూ?"

"నేను చూస్తున్న పేషంట్లే లోకమని నేను చెప్పడం లేదు. నాకు కొంత మందయితే, మరికొంతమంది డాక్టర్లకు ఇంకొంత మంది... లోకమంతా ఇదే కాక పోవచ్చు... కానీ ఇంత మంది భర్తృ విహీనులు గర్భస్థ శిశువులతో మా ముందుకు వచ్చి అతి దైన్యంగా దాన్ని విచ్ఛిన్నం చేయమని అడుగుతున్నారంటే... మీరూ, మీ సంఘమూ పెడుతున్న ఇన్ని నిషేధాలకు, గిరిగీతలకు, అసహ్యపు చూపులకు, భ్రష్టత్వపు

బిరుదులకు అతీతంగా, అసంపూర్ణ మాతృమూర్తులవుతున్నారంటే, కారణం తేలికగా ఊహించవచ్చు. శారీరకంగానూ, మానసికంగానూ వాళ్ళకి మగవాడి తోడు అవసరం. అది మానసికంగానీ, శారీరకంగానీ, వాళ్ళ ఆకలిని అణచుకోమని చెబుతున్నాం మనం. చీకటి ఒడిలో తుచ్ఛమైన శరీర వాంఛలను తీర్చుకుంటూ వాటి తాలూకు పర్యవసానాన్ని తుదముట్టించుకుంటూ... ఛీ... ఛీ... ఇంత అసహ్యంకరమూ, జుగుప్సాకరమూ అయిన జీవితాన్నే మనం మనకు తెలియకుండానే వాళ్ళకు నిర్దేశిస్తున్నది? గొడ్రాలికి చూపే జాలి. భర్తృవిహీనమీద ఎందుకు చూపించలేకపోతున్నాం? పెళ్ళికాని అమ్మాయికిచ్చే సానుభూతి, పతివిహీన కెందుకివ్వలేకపోతున్నాం? ఇదే సంఘమయితే, అదే మనల్ని పాలిస్తున్నదయితే దాన్ని ఏట్లో దూకమనండి. రా రామూ, నువ్వు త్రిపురను తీసుకెళ్ళు."

వదినవైపు భాషకందని చూపొకటి విసిరి త్రిపుర రెక్క పట్టుకొని లాగింది పెద్దక్క.

"అందరూ బరితెగించి, ఈ పిల్లలాగే పెళ్ళి అనగానే ఇహమూ, పరమూ ఆలోచించకుండా తలూపేస్తారా?" ఆమె చూపులు త్రిపురను నిలువెల్లా కాల్చేసి ఉంటాయి.

వదిన రెచ్చిపోయింది. "ఇదిగో, మీ భాషలో ముండమోపులైన ప్రతి ఆడపిల్లనూ తీసుకురండి మా శేఖరన్నయ్య నడిగినట్లే మెత్తగా, జాలిగా, అతిసహజంగా 'అమ్మాయ్ ఇంకా ఎంత కాలం భర్తను తలచుకుంటూ కుమిలిపోతావు? మరలా పెళ్ళి చేసుకో, తల్లీ!' అని మనస్ఫూర్తిగా అడగండి.... నా కల ఫలించి మీరలా అడిగే విశాలత్వం మీలో రావాలేగాని, నాకు తెలుసు. ఏ ఆడపిల్లా అభ్యంతరం చెప్పదు. మాతృత్వపు మాధుర్యం కొరకయినా తల ఊపుతుంది. బిడ్డతల్లుల అభ్యంతరాలు, వాళ్ళకే వదిలేసినా, ఈనాడైనాసరే, ఆడపిల్ల కనక సిగ్గుతోనో, సంకోచంతోనో, సంఘభీతితోనో మొదట ఒప్పుకోక పోవచ్చు. మరికొంత బలవంతం చేయండి. ప్రతి ప్రతివ్రతా ఒప్పుకొని తీరుతుంది. అందరికీ మనలాగే సుఖపడాలనీ నిండుగా బ్రతకాలనీ ఉంటుంది" అలా రెచ్చిపోయిన ఆమె కంఠం మెల్లమెల్లగా మెత్తగా మారిపోయింది.

"చనిపోయిన భర్తనే తలచుకుంటూ దాంపత్య జీవితానికి ఫుల్‌స్టాప్ పెట్టేసి జీవితాంతం కుళ్ళిపొమ్మని వాళ్లని మనం శాసిస్తున్నాం. భర్త స్మృతులను తుడిచిపెట్టమని నేననడం లేదు. నేను విజయ్‌ని మరచిపోయానా? సంజయ్‌ను ప్రేమించడం లేదూ?"

"ప్రతి ఆడపిల్లకూ తలలో పూలు తురుముకోవాలనీ, పట్టుచీర కట్టుకోవాలనీ, పేరంటాలకు వెళ్ళాలనీ అంతర్గతంగా ఉంటుంది. మగవాడిలా శరీర సుఖాల మీద అంత మోజు లేకపోవచ్చు. కానీ, తనకో సంసారం, భర్త, ముత్యాల్లాంటి బిడ్డలు కావాలని ఏ స్త్రీ కుండదు? మల్లెపూలు పెట్టుకొని... కేరింతలు కొట్టే పసిబిడ్డ నెత్తుకొని, భర్త

పక్కగా వెళ్ళే ఓ ఇల్లాలిని చూచి ఈర్ష్యపడే జుగుప్సాకరమైన స్థితినుండి వాళ్ళను బయటకు లాగాలని మీకు అన్పించడంలేదూ?"

"భగవంతుడు మనల్ని దురదృష్టవంతుల్ని చేస్తుంటే మనకు మనమే ఆ దురదృష్టాన్ని నీరుపోసి పోషించుకుంటున్నాం."

"మనతోటి స్త్రీని మరలా పెళ్ళిచేసుకోవద్దని శాసిస్తున్న మనం ఆమెకు అంతకంటే అందమైన జీవితాన్ని ఏమివ్వగలుగుతున్నాం? ఆమెకంటూ ఒక ప్రసన్నమైన జీవితాన్ని అందివ్వలేని మనం ఆమె సంపూర్ణమైన జీవితానికి ఎందుకు అడ్డుపడాలి? మనలో ఏ ఒక్కరం ఆ పిల్ల కొరకు మన సుఖంలో ఏ కొంతయినా త్యాగం చేస్తున్నామేమో చెప్పండి. మనలా ఆ పిల్లకి జంటగా సినిమా కెళ్ళాలనే భావం ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకొని మనింటిలో ఎంతమందిమి జంటగా సినిమా చూడటం మానేశామో చెప్పండి?"

ఆమె వాగ్ధోరణికి అనకట్ట లేకపోయింది.

"నేనెవరినీ త్యాగాలు చెయ్యమనడం లేదు. ఆ పిల్లకు కూడా ఆ అవకాశం ఇవ్వమని అడుగుతున్నాను."

"ఏమయ్యా, మరిదీ! చెల్లెలికి నిశ్శబ్దంగా ఇన్ని నీతులు చెప్పావు కదా! రేపు పొద్దున నువ్వు మాత్రం ఎందుకు పెళ్ళి చేసుకోవాలి? మానేయకూడదా? నువ్వు రచయిత వైనందున ఆంధ్ర పాఠకుల తరపున నేను సిగ్గు పడుతున్నానయ్యా."

ఛెళ్ళున నా ముఖాన అనవలసింది అనేసి చర్రున లోపలి కెళ్ళిపోయింది వదిన. అందరికంటె నా మౌనమే ఆమెను ఎక్కువ బాధించినట్టుంది.

ఏ ఒక్కరి సానుభూతి కాని, సపోర్ట్ కానీ లేకుండా ఒంటరిగా వాదించి, వాదించి మౌన తిరస్కారాల్ని, అనుమానాల్ని, అవమానాల్ని నిశ్శబ్దంగా ఇంతవరకు స్వీకరించిన వదిన నిర్వీర్యంగా పడక మీద వాలిపోయింది.

ఆమె కంఠ శోష కానీ, ఆమె రోదన కానీ మా ఇంట్లో ఏ ఒక్కరి హృదయాన్ని తాకలేకపోయింది. ఫలితంగా అందరం ఒత్తిడిచేసి, భయపెట్టి త్రిపురను ఈ పెళ్ళి నుండి విముఖురాల్ని చేశాము.

* * * * *

మురళి కంఠంలో తడికి, మాటల్లో పశ్చాత్తాపానికి రోహిణి చలించిపోయాడు. అయినా, ఈ మాట అనకుండా, ఉండలేకపోయాడు.

"మీ చెల్లెలికి చాలా అన్యాయం జరిగిందిరా." విచారంగా చూశాడు మురళి.

"కాదురా! అన్యాయానికి పరాకాష్ట అందుకుంది. ఆ పిల్ల చెడిపోయింది." అతని కంఠం వణికింది. రోహిణి ఉలిక్కిపడ్డాడు.

"చెడిపోయిందా?"

రాజేశ్వరి ఆశ్చర్యపోలేదు. నిర్లిప్తంగా వింటోంది.

"ఆ, ఆ సంగతి తెలిసిన రోజు పిన్ని, పెద్ద వదినా, అక్కా, ఆఖరున నాన్నగారు కూడా ఆ పిల్లను చీదరించుకున్నారు, తిట్టారు."

వదిన మాత్రం ఒకే ఒక మాట అంది.

"తప్పు చేసింది మనం. త్రిపుర నెందుకంటారు?"

అలా అన్న వదిన పెరట్లో కెళ్ళి చిన్న చెల్లిని ఒళ్ళోకి లాక్కుని, ఆ పిల్లతోపాటు కన్నీళ్ళు పెట్టుకుంటూ.. "దీనికి పరిష్కారం కాకూడదు, త్రిపురా. నీకీనాడు తెలిసే ఉంటుంది. దీనిగుండా నువ్వు పొందే సుఖం కంటే అశాంతే జాస్తి. ఆనాడే మనిద్దరం ఇంకాస్త ధైర్యం చెయ్యవలసింది" అనడం నా చెవులతో నేను విన్నాను.

రోహిణి మాట్లాడలేదు. మురళి అన్నాడు.

"కన్నీళ్ళ విలువ చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను నేను."

రోహిణి మాట్లాడే స్థితిలో లేడు. రాజేశ్వరి లేచి నిలబడింది.

"తెల్లవారుతున్నట్లుంది, నేను వెళతాను."

మురళీ ఆమెతో పాటు లేచి నిలబడ్డాడు.

"పదండి, దిగబెట్టి వస్తాను."

రోహిణి వద్ద చేతులు జోడించి, సెలవు తీసుకుని మురళి వెంట నడిచిందామె.

* * * * *

ఆమెను ఆ చిన్న ఇంట్లో దిగబెట్టి గడప దిగుతూ, ఆగి వెనక్కు తిరిగాడు మురళి.

"నేను మరలా ఒకరోజు ఈ ఇంటి గడప తొక్కుతాను. మీరు మనఃస్ఫూర్తిగా నా చేయి అందుకొని రావడానికిష్టపడితే చెప్పండి. ఆ రోజు సర్వసన్నాహంతో వస్తాను."

ఆమె సందేహంగా చూచింది. అంగీకారంగా నవ్వింది.